


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 48, పేజీలు - 08

మంగళవారం, జులై 22, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## సభలో నాకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదు

### - రాహుల్ గాంధీ ధ్వజం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నేతనైన తనకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. సభలో అధికార పక్ష సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంలోని మంత్రులకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చి తనకు మాత్రం తమ అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

2లో..

## భారత ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా

### - దేశ చరిత్రలో తొలిసారి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్య రీతిలో తన పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్య కారణాలను చూపుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ) ప్రకారం

2లో..

## కేరళ మాజీ ముఖ్యమంత్రి కన్నుమూత

### - శతాధిక వృద్ధుడు అచ్యుతానందన్ ఇకలేరు



తిరువనంతపురం (ప్రశ్న న్యూస్) కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్ట్ నేత వీఎస్ అచ్యుతానందన్ సోమవారం కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 101 ఏళ్లు కాగా గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జూన్ 23న గుండెపోటుకు గురికావడంతో చికిత్స కోసం ఆయనను కుటుంబసభ్యులు తిరువనంతపురం మెడికల్

2లో..

# తెలంగాణ రైజింగ్ 2047పై రేవంత్ రెడ్డి ఫోకస్

## - ఏటీసీల్లో ఫార్మా, లైఫ్ సైన్సెస్ కోర్సులు

- తెలంగాణ యువత కోసం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు - మూడు ఫేజ్‌ల్లో అభివృద్ధికి ఏర్పాట్లు - ఏటీసీల ఏర్పాటుపై ముఖ్యమంత్రి సమీక్ష





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ యువతకు అధునాతన నైపుణ్య శిక్షణ అందించేందుకు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) ఏర్పాటు, పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ అందించేలా ఏటీసీలను తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. మూడు ఫేజ్‌ల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీ ఏర్పాటు చేసి ఫార్మా, బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించే కోర్సులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. వీలైనంత త్వరగా ఏటీసీల అభివృద్ధి పనులు పూర్తవ్వాలని, ఈ పనులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలో మూడు ఫేజ్‌లలో ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు సీఎం చెప్పారు. ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3గా విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. ఫేజ్ -1లో 25, ఫేజ్-2లో 40, ఫేజ్-3లో 46 ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నామని.. వాటి పురోగతిపై ఈ సమీక్షలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫేజ్ - 1, ఫేజ్ - 2లో ఇప్పటి వరకు 49 అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. ఏటీసీల ఏర్పాటుకు అధికారులు యుద్ధ ప్రాతిపదకను పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా ఫార్మా, బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమల ఏటీసీ ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలంటూ అధికారు లకు రేవంత్ రెడ్డి సూచించారు. సమావేశంలో మంత్రి శ్రీ వి వేక్‌వెంకటస్వామి,ఉన్నతాధికారులు పాల్గొన్నారు

### గిగ్ వర్కర్స్‌కు సంక్షేమ నిధి

గిగ్ వర్కర్స్ పాలసీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గిగ్ కార్మికులకు ప్రతిపాదిత పాలసీని అధికారులు రేవంత్ రెడ్డి వివరించారు. వీళ్ల కోసం అధికారులు ఒక చట్టబద్ధమైన గుర్తింపు అంశాలన్ని పాలసీలో ప్రతిపాదించారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించేలా ప్రతిపాదనలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిగ్ కార్మికుల పాలసీపై అధికారులకు పలు సూచనలు చేశారు. గిగ్ వర్కర్స్ సమాచారం మొత్తం ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలంటూ సీఎం సూచించారు.

# దటీజ్ ఇండియా

## - ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పార్లమెంటు వర్షాకాల సమావేశాల సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రత, ఆర్థిక స్థిరత్వంలో సాధించిన ప్రధాన విజయాలను ప్రస్తావించారు. దేశ రాజధాని ఢిల్లీలో మీడియాను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను సెలబ్రేషన్ ఆఫ్ విక్టరీ అని అభివర్ణించారు. ఆపరేషన్ సిందూర్ తో పాక్ కు గట్టిగా బుద్ధి చెప్పామని, ఇది భారత విజయం అన్నారు. ప్రపంచం ముందు భారతదేశ సైనిక పరాక్రమాన్ని చాటి చెప్పామని పేర్కొన్నారు.

### 22 నిమిషాల్లో ఉగ్ర స్థావరాలు నేలమట్టం

పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిపై ప్రధాని మోదీ మాట్లాడుతూ, "ఈ వర్షాకాల సమావేశం మన విజయానికి వేదిక. భారతదేశ సైనిక శక్తిని ప్రపంచం మొత్తం చూసింది. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం నిర్దేశించిన లక్ష్యాన్ని నూటికి నూరుపాళ్లు సాధించింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల స్థావరాలను కేవలం 22 నిమిషాల్లోనే నేలమట్టం చేశారు." ఈ ఆపరేషన్‌ను భారతదేశం ఉగ్రవాదంపై తీసుకున్న దృఢమైన వైఖరికి చిహ్నంగా, వ్యూహాత్మక విజయంగా ప్రధాని కొనియాడారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదంతో ఇబ్బంది

2లో..

## రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణా భూముల ధరల సీన్ రివర్స్

- తెలంగాణ రాష్ట్రంలో భూముల ధరలు తగ్గాయి
- రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పరిస్థితులు తారుమారయ్యాయి
- రాష్ట్రంలోని మెజార్టీ పరిషత్‌లు గెలుచుకుంటామని హరీశ్ రావు ధీమా

2లో..



## పైలట్లపై అమెరికా మీడియా తప్పుడు ప్రచారం

### - పార్లమెంట్‌లో తేల్చి చెప్పిన రామ్మోహన్ నాయుడు

2లో..



## ఆగస్టు 15 నుంచి మహిళలకు "జీరో ఫేర్ టిక్కెట్"

### - సీఎం చంద్రబాబు ఆదేశం

- గత ఎన్నికల వేళ హామీ ఇచ్చిన కూటమి
- మహిళలకు వెసులబాటు కలిగించనున్న పథకం
- అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆగస్టు 15 నుంచి అమలు కానుంది. ఈ పథకంలో భాగంగా మహిళలకు 'జీరో ఫేర్ టిక్కెట్' జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఈ జీరో ఫేర్ టిక్కెట్‌లో ప్రయాణికుల ప్రయాణ వివరాలు, ఉచిత ప్రయాణం వల్ల వారికి ఆదా అయిన మొత్తం, మరియు ప్రభుత్వం 100 శాతం రాయితీని ఇస్తుందనే వివరాలను స్పష్టంగా పొందుపరచాలని

2లో..



## 2030 నాటికి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీ

### - అమరావతి డిక్లరేషన్ విడుదల చేసిన చంద్రబాబు

**అమరావతి** 2030 నాటికి ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మార్చేందుకు అవసరమైన కార్యాచరణ ప్రకటించారు ఏపీ సీఎం చంద్రబాబు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో దేశానికే ఆదర్శంగా నిలవాలని 'గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ- అమరావతి డిక్లరేషన్'ను సోమవారం నాడు విడుదల చేశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో చీఫ్ సెక్రటరీ విజయానంద్, నెడ్ క్యాప్ ఎండి కమలాకర్ బాబు సమక్షంలో చంద్రబాబు

2లో..





## నెలాఖరులో రేషన్ కార్డుల పంపిణీ

### - కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

- రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ, ఆందోళన వద్దన్న ముఖ్యమంత్రి
- ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు రేషన్ కార్డుల పంపిణీ
- మండల కేంద్రాల్లో పంపిణీకి చర్యలు
- ఇప్పటి వరకు 7 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వెల్లడి

2లో..

## టాలీవుడ్ సెలబ్రిటీలకు ఈడీ నోటీసులు

### - బెట్టింగ్ యాప్ ప్రమోషన్ చేసిన కేసులో నోటీసులు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బెట్టింగ్ యాప్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. పలువురు టాలీవుడ్ స్టార్స్‌కు ఈడీ తాజాగా నోటీసులిచ్చింది. రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రకాష్ రాజ్‌లను విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ నెల 23న రానా, 30న ప్రకాష్ రాజ్, ఆగస్ట్ 6న విజయ్ దేవరకొండ, ఆగస్ట్ 13న మంచు లక్ష్మి విచారణకు రావాలని ఈడీ నోటీసులు ఇచ్చింది. బెట్టింగ్ యాప్ ప్రమోషన్లపై గతంలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ తాజాగా విచారణ చేపట్టింది. పంజాగుట్ట, సూర్యాపేట, మియాపూర్, విశాఖలో నమోదైన కేసుల ఆధారంగా ఇన్వెస్టిగేషన్

2లో..

## బండి సంజయ్‌తో మల్లారెడ్డి కోడలు భేటీ

### - బండి సంజయ్‌కు ఫ్లెక్సీలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బండి సంజయ్ బోనాల వేడుకల కోసం పాతబస్తీ వస్తే అక్కడ బీజేపీ నేతలు మాత్రమే కాదు మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సోమవారం బండి సంజయ్‌కు విందు కూడా ఇచ్చారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ మారుతున్నాయి. కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ కు బీఆర్ఎస్ పార్టీలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న కుటుంబానికి చెందిన

2లో..

## ఈడీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

### - రాజకీయ పోరాటం చేయొద్దని హితవు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** సూర్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (ముడా) భూముల అక్రమ కేటాయింపుల కేసులో దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి కర్ణాటక హైకోర్టు తీర్పును ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్ ను పరిశీలించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ల

2లో..

## సభలో నాకు మాట్లాడేందుకు
# అవకాశం ఇవ్వడం లేదు

ప్రతిపక్ష నేతగా మాట్లాడే హక్కు తనకు ఉన్నప్పటికీ మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వకపోవడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమేనని రాహుల్ అన్నారు. లోక్ సభలో చర్చ ప్రారంభమైన వెంటనే ప్రధాని మోదీ వెళ్లిపోయారని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అన్ని విషయల్లో వారికి అనుకూలమైన కొత్త విధానాలను సృష్టించుకుంటోందని విమర్శించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆపరేషన్ సిందూర్ తో పాటు, పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ లోక్ సభలో విపక్ష పార్టీల సభ్యులు ఆందోళనకు దిగారు. విపక్ష పార్టీలు ఆందోళనను విరమించాలని లోక్ సభ స్పీకర్ పలుమార్లు విన్నవించినప్పటికీ వారు పట్టించుకోలేదు. దీంతో, స్పీకర్ సభను కాసేపు వాయిదా వేశారు.

# భారత ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా

ఈ రాజీనామా తక్షణమే అమలులోకి వస్తుంది. ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడానికి మరియు వైద్య సలహాను పాటించడానికి తాను తక్షణమే రాజీనామా చేస్తున్నట్లు జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా లేఖలో వెల్లడించారు. స్థిరమైన మద్దతు మరియు సహకారం అందించారంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మంత్రివర్గ సభ్యులకు వారి అమూల్యమైన సహకారం మరియు మద్దతు పట్ల ధన్‌ఖడ్ ధన్యవాదాలు తెలిపారు. తన పదవీ కాలంలో చాలా నేర్చుకున్నానని, పార్లమెంటు సభ్యుల నుంచి తనకు లభించిన ఆప్యాయత, నమ్మకం మరియు ప్రేమను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని ఆయన అన్నారు. తన పదవీ కాలంలో భారతదేశ ఆర్థిక పురోగతి, అభివృద్ధిని చూసినందుకు ధన్‌ఖడ్ గర్వంగా ఉన్నట్లు పేర్కొన్నారు. "భారత్ ప్రపంచ ఖ్యాతి, అద్భుతమైన విజయాలతో నేను గర్వపడుతున్నాను. దేశం ఉజ్వల భవిష్యత్తుపై నాకు గట్టి నమ్మకం ఉంది" అని ఆయన తన వీడ్కోలు సందేశంలో తెలిపారు. జగదీప్ ధన్‌ఖడ్ 2022 ఆగస్టు 11 నుంచి భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు అందుకున్నారు. రాజ్యసభ ఛైర్మన్‌గా సేవలు అందించారు. అంతకుముందు, ఆయన 2019 నుంచి 2022 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా కూడా పనిచేశారు. తన రాజీనామాకు ముందు, ఆయన పార్లమెంటు వర్షాకాల సమావేశాలను రాజ్యసభ ఛైర్మన్‌గా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఆయన రాజకీయ పక్షాలను కోరారు.

# కేరళ మాజీ ముఖ్యమంత్రి కన్నుమూత

కాలేజీ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆయన ఐసీయూలోనే ఉన్నారు. వైద్యుల చికిత్స చేస్తున్నా రోజు రోజుకూ ఆయన ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. ఏడుగురు వైద్యుల బృందం ఆయనను నిరంతరం పర్యవేక్షించింది. అయితే, చివరకు పరిస్థితి విషమించి సోమవారం మధ్యాహ్నం అచ్యుతానందన్ తుదిశ్వాస విడిచారు. వీఎస్ అచ్యుతానందన్ 2006 నుంచి 2011 వరకూ కేరళ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇక, దశాబ్దాల పాటు కేరళ రాజకీయాల్లో చక్రం తిప్పిన వెళ్లప్పల్లి సత్యనాథన్ అచ్యుతానందన్ కమ్యూనిస్టు ఉద్యమానికి జీవితం అంకితం చేసిన నేతగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాట యోధునిగా గుర్తింపు పొందారు. 1923లో అలప్పూజ జిల్లా పునప్రాలోని ఒక సాధారణ వ్యవసాయ కూలీ కుటుంబంలో జన్మించిన అచ్యుతానందన్, బాల్యంలో కార్మిక హక్కుల కోసం పోరాడే కమ్యూనిస్ట్ ఉద్యమంలోకి ప్రవేశించారు. ట్రావెన్‌కోర్ దివాన్.. అమెరికన్ మోడల్ ప్రభుత్వ ఏర్పాటు ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరిగిన పునప్రా–వేలయార్ ఉద్యమానికి అచ్యుతానందన్ నాయకత్వం వహించారు. 'కేరళ అక్టోబర్ విప్లవం'గా గుర్తింపు పొందిన ఈ ఉద్యమంలో అచ్యుతానందన్ క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. దీంతో ఆయనను అరెస్ట్ చేసిన పోలీసులు.. కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారు. ఈ సంఘటన అచ్యుతానందన్ జీవితాన్ని మలుపు తిప్పింది. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కౌన్సిల్ నుంచి నిష్క్రమించారు. అనంతరం కొత్తగా ఏర్పడిన మార్క్సిస్టు పార్టీ సిపిఐ(ఎం)కు సహ–వ్యవస్థాపకుడిగా వ్యవహరించారు. అసమానంగా సాగిన ఆయన రాజకీయ జీవితంలో పార్టీ కార్యదర్శిగా, విపక్ష నేతగా, అనంతరం కేరళ ముఖ్యమంత్రిగా సేవలందించారు. అచ్యుతానందన్ మృతిపై రాజకీయ నేతలు, ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. 'అచ్యుతానందన్ కేవలం రాజకీయ నేతే కాదు, ప్రజాస్వామ్యం పట్ల అపార నిబద్ధత కలిగిన మార్గదర్శకుడు' అని కొనియాడుతున్నారు.

# దటీజ్ ఇండియా

పడిన ప్రాంతాలలో సైతం నక్సలిజం తగ్గుముఖం పట్టింది. ఇది సమన్వయంతో కూడిన, ప్రభావవంతమైన చర్యలు చేపట్టారని దేశ భద్రతా దళాలను ప్రధాని మోదీ ప్రశంసించారు.

### ఆర్థిక మైలురాళ్ళు, ప్రపంచ స్థాయిలో గుర్తింపు

గత దశాబ్దంలో భారతదేశ ఆర్థిక విజయాలను ప్రధాని మోదీ హైలైట్ చేశారు. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. ద్రవ్యోల్బణం అప్పుడు రెండంకెలలో ఉందన్నారు. "నేడు రేటు దాదాపు 2 శాతానికి తగ్గడంతో, ఇది దేశంలోని సామాన్య ప్రజల జీవితాల్లో ఉపశమనం కలిగించిందని మోదీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఒక ముఖ్యమైన సామాజిక మైలురాయిని కూడా హైలైట్ చేశారు.

"25 కోట్ల మంది పేద ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. దీనిని ప్రపంచంలోని అనేక సంస్థలు ప్రశంసిస్తున్నాయి. ఆర్థిక స్థితిస్థాపకతలో భారతదేశం సాధించిన ప్రగతి' ఇదేనన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నేటి ఉదయం ప్రారంభమయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అంశాలతో పాటు పాక్, భారత్ యుద్ధానికి విరామం తన విజయమని డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై చర్చ జరగాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. పార్లమెంట్ లో ప్రధాని మోదీ వీటికి బదులివ్వాలని అప్పుడే ఓ క్లారిటీ వస్తుందని విపక్ష నేతలు అంటున్నారు. మూడు నెలలు ముగిసినా పహల్గాం ఉగ్రదాది నిందితులను మోదీ సర్కార్ పట్టుకోలేకపోయిందని మల్లికార్జున ఖర్గే విమర్శించారు.

# రేవంత్ రెడ్డి పాలనలో
## తెలంగాణా భూముల ధరల సీన్ రివర్స్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలంగాణలో ఎకరం అమ్మితే, ఏపీలో పది ఎకరాలు కొనే పరిస్థితి వచ్చిందని కానీ రేవంత్ పాలనలో అంతా ఉల్టా అయిందంటూ హరీష్ రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పరిస్థితి ఇలా ఉందంటే రేవంత్ రెడ్డి మరో రెండేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటే పరిస్థితి ఇంకా దిగజారుతుందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత రోజులకు తీసుకెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు ఆంధ్రలో మాటలను గుర్తు చేసిన హరీష్ రావు, ఇప్పటి పాలనపై విమర్శలు చేశారు. ప్రజ్ఞాపూర్ వేదికగా గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి వచ్చి రెండేళ్లు కూడా పూర్తి కాకుండానే తెలంగాణలో సీన్ రివర్స్ అయిందంటూ వ్యంగ్యంగా విమర్శలు చేశారు. సిద్ధిపేట నియోజకవర్గంలోని చిన్నకొండూరు మండలం గంగాపూర్ గ్రామానికి వెళ్లినప్పుడు అక్కడ ప్రజలు తమ బాధలు చెప్పుకొన్నారని, అమ్ముదామంటే కనీసం భూములు కూడా కొనడం లేదని ప్రజలు చెబుతున్నారని హరీష్ రావు అన్నారు. అప్పట్లో నలభై లక్షల రూపాయలకు భూమి అడిగితే తాము ఇవ్వలేదని, ఇప్పుడు ఇరవై లక్షలకు ఇద్దామన్నా ఎవ్వరూ రావడం లేదని తనతో చెప్పారన్నారు. ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లో సీన్ రివర్స్ అయిందని అక్కడ చంద్రబాబు, ఇక్కడ రేవంత్ రెడ్డి రావడంతో భూములు ధరలు మారిపోయాయన్నారు.

ఆంధ్రలో ఎకరం అమ్మితే తెలంగాణలో రెండు ఎకరాలు వస్తుందని, రేవంత్ రెడ్డి ఇంకో రెండేళు అధికారంలో ఉంటే ఇంకేమవుతుందో అని హరీష్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారని, ఎరువుల కోసం చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితి వచ్చిందని హరీష్ రావు అన్నారు. కేసీఆర్ పాలనలో ఎప్పుడైనా యూరియా కోసం లైన్‌లో నిలబడ్డారా అని ప్రశ్నించారు. కేసీఆర్ గద్దె దిగిన తర్వాత మళ్లీ పాస్ బుక్‌లు, చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితి దాపురించందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరాకు ఒక్క సంచీ మాత్రమే ఇస్తున్నారని, కానీ కేసీఆర్ పాలనలో ఇలాంటి పరిస్థితే లేదని హరీష్ రావు గుర్తు చేశారు.

ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్రంలోని 31 జిల్లా పరిషత్‌లలో 16–18 బీఆర్ఎస్ సొంతం చేసుకోబోతుందని తేలిందని అన్నారు. సిద్దిపేటలోని మెజార్టీ మండలాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ ఎలా ఉండేది, కాంగ్రెస్ హయాంలో ఎలా అయిందో ప్రజలకు అర్థమైందని అన్నారు. 12 వేల ఉద్యోగాలు ఇచ్చి 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో లక్షా 68 వేల ఉద్యోగాలు ఇచ్చారని ఆయన వెల్లడించారు. నాడు అశోక్ నగర్ వెళ్లిన రాహుల్ గాంధీ ఇప్పుడు పత్తా లేడని విమర్శించారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడానికి అశోక్ నగర్‌లో విద్యార్థులు, నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయని అన్నారు.

# పైలట్లపై అమెరికా మీడయా తప్పుడు ప్రచారం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిపోయిన ఘటనపై అమెరికా మీడియా 'పైలట్ తప్పిదం' అనే అంశాన్ని హైలెట్ చేస్తూ ప్రచారం చేస్తోంది. ఈ వాదనను కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తిరస్కరించారు. పైలట్ తప్పిదానికి సంబంధించి విదేశీ మీడియాల్లో జరుగుతున్న ప్రచారంపై పార్లమెంట్ లో మంత్రి స్పందించారు. పాశ్చాత్య మీడియాలో వస్తున్న ఇలాంటి వార్తలు వారి స్వార్థపూరిత ఆలోచనల కోసమే అయి ఉండవచ్చన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో సీనియర్ పైలట్‌పై నింద మోపడానికి ప్రయత్నించిన పాశ్చాత్య మీడియా కథనాన్ని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు ఆదివారం మరోసారి ఖండించారు. విమాన ప్రమాదాలను దర్యాప్తు చేయడానికి బాధ్యత వహించే కేంద్ర సంస్థ అయిన ఎయిర్ యాక్సిడెంట్స్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ (ఏఏఐబీ)పై తాను నమ్మకం ఉంచానని ఆయన అన్నారు. "నేను ఏఏఐబీని నమ్ముతాను. ఏఏఐబీ చేస్తున్న పనిని నేను నమ్ముతాను. వారు భారతదేశంలో ఇక్కడ డేటాను డీకోడ్ చేయడంలో అద్భుతమైన పని తీరు చూపించారు. ఇది భారీ విజయం," అని రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రాథమిక నివేదిక ఇచ్చిన ఏజెన్సీని ప్రశంసించారు. ది వాల్ స్ట్రీట్ జర్నల్ ,రాయిటర్స్ వంటి సంస్థలు పైలట్ల తప్పిదమేనని వార్తలు ప్రచరించాయి. స్వార్థపూరితంగా నివేదికను తప్పుదోవ పట్టించేలా ఇలాంటి కథనాలు ప్రచురించవద్దని ఏఐబీబీ ఇప్పటికే పాశ్చాత్య మీడియాకు విజ్ఞప్తి చేసిందన్నారు. తుది నివేదిక రాక ముందు ఆధారం లేని సిద్ధాంతాలను ప్రచారం చేయవద్దని రామ్మోహన్ నాయుడుహెచ్చరించారు. తుది నివేదిక రాకముందే ఏవైనా వ్యాఖ్యలు చేయడం ఎవరి తరపున అయినా మంచి పద్ధతి కాదన్నారు. తుది నివేదికకు ముందు ఏదైనా నిర్ణయానికి రావడం సరి కాదని జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. విమాన ప్రమాదాలను దర్యాప్తు చేయడంలో భారతదేశం గత సంవత్సరాల్లో సాధించిన పురోగతిని కూడా రామ్మోహన్ నాయుడు గుర్తు చేశారు. గతంలో డేటాను బయటకు తీసుకురావడానికి బ్లాక్ బాక్స్‌ను ఎల్లప్పుడూ విదేశాలకు పంపేవారు. భారతదేశంలో డేటాను డీకోడ్ చేయడం ఇదే మొదటి సారి అని గుర్తు చేశారు. ఏఏఐబీ తన ప్రాథమిక దర్యాప్తు నివేదికలో కాక్‌పిట్ రికార్డింగ్‌ను వెల్లడించింది, అందులో ఒక పైలట్ "మీరు ఇంధనాన్ని ఎందుకు ఆపివేసారు?" అని అడుగుతున్నట్లు వినిపించింది. మరొక పైలట్ "నేను అలా చేయలేదు" అని బదులిచ్చారు. ఇంధన సరఫరా ఉద్దేశపూర్వకంగా ఆపివేయబడిందా లేదా అనే దానిపై వ్యాఖ్యానించకుండా ఏఏఐబీ నివేదిక అక్కడితో ఆగింది. అయితే మాజీ యూఎస్ అధికారి పేరుతో వాల్ స్ట్రీట్ జర్నల్, ఇది సీనియర్ పైలట్ ఉద్దేశపూర్వకంగా చేసిన పని అని కథనాలు ప్రసారం చేయడంతో సమస్య ప్రారంభమయింది. దీన్ని రామ్మోహన్ నాయుడు నిర్మోహమాటంగా ఖండించారు.

## ఆగస్టు 15 నుంచి మహిళలకు "జీరో ఫేర్ టిక్కెట్"

సూచించారు. దీనివల్ల రాష్ట్రంలోని మహిళా ప్రయాణికులందరికీ తాము ఎంత లబ్ధి పొందారనే విషయం సులభంగా తెలుస్తుందని అన్నారు. ఇందుకోసం అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాల అమలు, వాటి ఆర్థిక భారంపై కూడా అధికారులతో చర్చించారు. ఈ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నుంచి సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

### ఆర్టీసీని లాభాల బాట పట్టించాలన్న చంద్రబాబు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు నేపథ్యంలో ఆర్టీసీకి ఆర్థిక భారం తగ్గించి, సంస్థను లాభాల బాట పట్టించే మార్గాలపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. ఆదాయ మార్గాలను పెంపొందించడం, నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవడం ద్వారా సంస్థను లాభసాటిగా మార్చాలని సూచించారు. లాభాల ఆర్జన కోసం ఎలాంటి విధానాలు తీసుకురావాలి అనే దానిపై కార్యాచరణ రూపొందించాలని కోరారు.

### ఇకపై ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు ప్రాధాన్యత

రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్రిక్ బస్సులు మాత్రమే కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. ప్రస్తుతం ఉన్న బస్సులను కూడా ఎలక్ట్రికల్ బస్సులుగా మార్చడం ద్వారా నిర్వహణ వ్యయం తగ్గుతుందని అన్నారు. ఈ బస్సులకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలని కూడా సూచించారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లోనూ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ చర్యల ద్వారా ఆర్టీసీ స్వయంసమృద్ధి సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# టాలీవుడ్ సెలబ్రిటీలకు ఈడీ నోటీసులు

చేస్తోంది. ఈ ప్రమోషన్లకు సంబంధించి గతంలో దాదాపు 29 మంది సెలబ్రిటీలు, కంపెనీలపై కేసులు ఫైల్ చేసింది.

### ఇన్‌ఫ్లుయెన్సర్స్ నుంచి బుల్లితెర యాక్టర్స్ వరకూ..

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ నుంచి యాంకర్స్, బుల్లి తెర యాక్టర్స్, సెలబ్రిటీల వరకూ చాలామందిపై కేసులు నమోదయ్యాయి. రానా దగ్గుబాటి, ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రణీత, అనన్య నాగళ్ల, శ్యామల, సిరి హనుమంతు, వర్షిణి సౌదర్ రాజన్, వసంతి కృష్ణన్, శోభాశెట్టి ఇలా 29 మంది సెలబ్రిటీలపై కేసులు నమోదు చేశారు. చట్ట విరుద్ధ యాప్స్ డౌన్ లోడ్ చేసుకోవాలంటూ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ విస్తృతంగా ప్రచారం చేశారంటూ వీరిపై ఆరోపణలు ఉన్నాయి.

### ఆ సంస్థలకు నోటీసులు

రెండు రోజుల క్రితం టెక్ దిగ్గజాలైన గూగుల్, మెటా సంస్థలకు ఈడీ నోటీసులు జారీ చేసింది. విచారణకు రావాలని కంపెనీ ప్రతినిధులకు సూచించింది. మనీ లాండరింగ్, హవాలా లావాదేవీలు జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. అయినా ఈ సంస్థలు తమ మాధ్యమాల్లో ఈ యాప్స్ ప్రచారం చేస్తున్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ కంపెనీలు బెట్టింగ్ యాప్స్ యాడ్స్‌కు స్లాట్స్ కేటాయించడమే కాకుండా వెబ్ సైట్ లింక్స్ కూడా అందుబాటులో ఉంచుతున్నాయని చెబుతోంది. మరోవైపు, మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలను విచారించింది. తాజాగా, బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల వ్యవహారంలో టాలీవుడ్‌కు చెందిన సెలబ్రిటీలు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లను విచారించేందుకు రెడీ అవుతోంది.

## బండి సంజయ్‌తో
# మల్లారెడ్డి కోడలు భేటీ

ఔత్సాహిక రాజకీయ నేత ఫ్లెక్సీలు కట్టడం, విందులు ఇవ్వడం వ్యక్తిగతం అని అనుకోవడానికి లేదని అంటున్నారు.

### రాజకీయ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి

మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి రాజకీయాల్లోచురుగ్గా ఉంటున్నారు. తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని కొన్ని సందర్భాల్లో ఆమె అన్న మాటలు వైరల్ అయ్యాయి. ఇప్పుడు ప్రీతిరెడ్డి నేరుగా రాజకీయాలు చేస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవల మల్లారెడ్డితో పాటు మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి కూడా బీఆర్ఎస్ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదు. గతంలో ఉన్నంత దూకుడుగా లేరు. ఈ క్రమంలో ఆయన కుటుంబసభ్యులు పార్టీ మారే ఆలోచనల్లో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

### ఇటీవల జోరు తగ్గించిన మల్లారెడ్డి - బీఆర్ఎస్ లో స్లో

భారత రాష్ట్ర సమితిలో ప్రస్తుతం యాక్టివ్ గా ఉండటం కన్నా బీజేపీలో చేరితే ప్రయోజనం ఉంటుందని మల్లారెడ్డి అనుకుంటున్నారేమో తెలియదు కానీ ఆ పార్టీ నేతలతో పరిచయాలు పెంచుకునేందుకు మాత్రం ఆసక్తి చూపిస్తున్నారన్నది బహిరంగ రహస్యంగానే ఉంది. మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి ఇద్దరూ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో మంచి పట్టు కూడా ఉంది. అక్కడ ఉన్న పరిస్థితుల దృష్ట్యా బండి సంజయ్ కూడా వారిని పార్టీలోకి ఆహ్వానించేందుకు వెనుకాడరని అంటున్నారు.

### గ్రేటర్ ఎన్నికల కోసమే వ్యూహమా.?

త్వరలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు జరగనున్నాయి. అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే భారత రాష్ట్ర సమితి ద్వారా సాధ్యం కాదని బీజేపీలో అయితే బెటరని మల్లారెడ్డి కుటుంబం ఆలోచిస్తున్నట్లుగా చెబుతున్నారు. భారతీయ జనతా పార్టీ ప్రస్తుత తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు మల్కాజిగిరి చెందిన వారే. బండి సంజయ్ మద్దతు రామచంద్రరావుకు ఉందని భావిస్తున్నారు. తెలంగాణ బీజేపీలో ఇప్పుడు చక్రం తిప్పేది బండి సంజయ్ అనే ప్రచారం జరుగుతున్న తరుణంలో మల్లారెడ్డి కుటుంబం ఆయన ద్వారా బీజేపీలోకి వెళ్లేందుకు మార్గం సుగమం చేసుకుంటోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మల్లారెడ్డి చాలా ఒత్తిడికి గురయ్యారు. ఆయనపై చాలా కేసులు నమోదయ్యాయి. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నించారని డీకే శివకుమార్ తో సమావేశమయ్యారని ప్రచారం జరిగింది. ఫోటోలు కూడా వెలుగులోకి వచ్చాయి. కానీ తర్వాత అన్నీ సద్దుమణిగాయి. రాజకీయాల నుంచి వైదొలుగుతానని ఓ సారి ప్రకటన కూడా చేశారు.

# 2030 నాటికి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీ

గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్ విడుదల చేశారు. ఇటీవల అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్‌పై రెండు రోజుల పాటు సమ్మిట్ నిర్వహించారు.

### సమ్మిట్‌లో చర్చించిన అంశాలతో అమరావతి డిక్లరేషన్

అమరావతిలో జరిగిన సమ్మిట్‌లో 600 మంది ప్రతినిధులు, ఇండస్ట్రీ రంగ నిపుణులు పాల్గొన్నారు. 7 సెషన్స్‌గా జరిగిన సమ్మిట్‌లో పాల్గొన్న గ్రీన్ హైడ్రోజన్ కంపెనీల సీఈఓలు, సీఓఓలు, ఎండీలు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన సమ్మిట్‌లో చర్చించిన అంశాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ప్రకటించింది. భారత్‌లో స్వచ్ఛమైన ఇంధనాల ఉత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు విధివిధానాలు రూపొందించేలా డిక్లరేషన్ ప్రకటించారు. ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు కల్పించాలని లక్ష్యంగా కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది.

### గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా ఏపీ

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి దేశంలోనే అతిపెద్ద ఎకో సిస్టంను ఏపీలో నెలకొల్పటమే డిక్లరేషన్ ప్రధాన ఉద్దేశ్యం. 2027 నాటికి 2 గిగావాట్లు, 2029కి 5 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ల తయారీ లక్ష్యంగా పెట్టుకుంది. 2029 నాటికి ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయనున్నారు. కిలో హైడ్రోజన్ గ్యాస్ రూ.460 నుంచి రూ.160కి తగ్గించేలా పరిశోధనలు, కార్యాచరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. 2029 నాటికి 25 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ పంపిణీకి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయాలని డిక్లరేషన్ లో పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా దీన్ని తీర్చిదిద్దాలని డిక్లరేషన్‌లో నిర్ణయం తీసుకున్నారు. సరికొత్త గ్రీన్ ఎనర్జీ ఆవిష్కరణలు, పరిశోధనల కోసం రూ.500 కోట్లు వ్యయం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. గ్రీన్ హైడ్రోజన్ దిశగా కృషి చేసే 50 స్టార్టప్‌లకు ప్రోత్సాహం కల్పించాలని తాజా డిక్లరేషన్‌లో ప్రకటించారు.

# నెలాఖరులో రేషన్ కార్డుల పంపిణీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జిల్లా కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ కార్డులు పంపిణీ చేయాలంటూ ఆదేశించారు. మంత్రులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈ కార్డులు పంపిణీ చేయనున్నట్లు సీఎం చెప్పారు. రాష్ట్రంలో వర్షాలు నమోదవుతున్న సమయంలో జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి అప్రమత్తం చేశారు. ప్రతిరోజూ కలెక్టర్లు ఏం చేస్తున్నారు అనేది తనకు రిపోర్ట్ పంపాలంటూ ఆదేశించారు. ఇప్పటివరకు ఏడు లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని, ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలంటూ రేవంత్ రెడ్డి చెప్పారు. అన్ని మండల కేంద్రాల్లో ఈ పంపిణీ కార్యక్రమం జరగాలని మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలన్నారు. ఈ రేషన్ కార్డుల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు 21 శాతం వర్షపాతం నమోదైందని ఇది తక్కువ వర్షపాతమని పేర్కొన్నారు. మూడు రోజులు భారీ వర్షాలు నమోదవుతుండటంతో అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 150 బృందాలను ఏర్పాటు చేశామని, వాతావరణ సూచనలకు అనుగుణంగా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సమన్వయం చేసుకొని బృందాలను పంపిస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ ఆంక్షలు లేకుండా పోలీస్ కమిషనర్లు చూసుకోవాలన్నారు. జిల్లాల్లో పిడుగుపాటు కారణంగా జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలని కలెక్టర్లకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో అంటు వ్యాధులు సోకకుండా ఐటీడీఏ అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో వైద్యులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు సంబంధించి వెటర్నరీ అధికారులు కూడా అందుబాటులో ఉండాలని సూచించారు. అజాగ్రత్తగా ఉంటే సహించేది లేదని, కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రంలో సరిపడినన్ని ఎరువులు ఉన్నాయని, రైతులు యూరియా కోసం లైన్‌లో నిలబడటం అనేది అబద్ధమని రేవంత్ రెడ్డి అన్నారు. యూరియా కోసం లైన్‌లో నిలబడ్డట్టు, చెప్పులు లైన్‌లో పెట్టినట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఎరువులు దొరకనట్లు ఆర్టిఫిషియల్ షార్టేజ్ క్రియేట్ చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల దుకాణాల్లో ఎంత స్టాక్ ఉందో బయట నోటీస్ బోర్డు పెట్టాలని సూచించారు. రాయితీ ఎరువులు పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

# ఈడీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. భూముల అక్రమ కేటాయింపుల వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతి, రాష్ట్ర మంత్రి సురేశ్ లకు జారీ చేసిన సమన్లను హైకోర్టు కొట్టివేసిందని ఈడీ గుర్తుచేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్ ను పరిశీలిస్తూ ఈ వ్యవహారంలో ఈడీ రాజకీయ పోరాటం చేస్తోందని సుప్రీం ధర్మాసనం విమర్శించింది. ఇది ముమ్మాటికీ అధికార దుర్వినియోగం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. పిటిషన్ పరిగణనలోకి తీసుకోవడంలేదని స్పష్టం చేసింది. ఈడీని రాజకీయ పోరాటాలకు ఎందుకు ఉపయోగిస్తున్నారంటూ న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ కేసు విచారణకు స్వీకరించడంపై సీజేఐ బెంచ్ అయిష్టత వ్యక్తం చేసింది.

## ఈ నెల 25న చలో వేములవాడ మున్నూరు కాపు సమావేశం విజయ వంతం చేయాలి.

**- మున్నూరు కాపులు పెద్ద ఎత్తున పాల్గొనాలి**

**- కాపు సంఘం నాయకులు వాడికల పాండయ్య పిలుపు**

**మహేశ్వరం (ప్రశ్న న్యూస్)** ఈనెల 25న చలో వేములవాడ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని అమీర్పేట్ కాపు సంఘం అధ్యక్షులు వాడి కల పాండయ్య తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్పేటలో ఆదివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు పాండయ్య మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం తలపెట్టిన చలో వేములవాడ ర్యాలీ సన్నాహక సమావేశం చేయాలన్నారు. మహేశ్వరం మండలం నుంచి మున్నూరు కాపు పెద్దలు తరలివెల్లి చలో వేములవాడ కార్ల ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల కృష్ణ, ఉపాధ్యక్షులు వాడి కలసిద్దులు, మహేశ్వరం నుండి గాజుల శ్రీశైలం, వనంపల్లి శ్రవణ్, కోళ్ల పడకల్ గ్రామం నుంచి నాగుల సత్యం, ఆవుల కుమార్, మండల మున్నూరు కాపు నాయకులు ఆవుల యాదయ్య, మద్దూరి చంద్రయ్య, ఇమ్మడి ప్రవీణ్ పటేల్, కంది శ్రీనివాస్, ఆవుల రమేష్, ఇలిటం బిక్షపతి, ఆకుల వీరబాబు, రాజుల నరసింహ, సిద్ధులు, వాడికల నరసింహ, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# యుపిఐ చెల్లింపుల్లో మనమే టాప్..!




భారతదేశం యూపీఐ చెల్లింపులలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ప్రతి నెల 1800 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. జూన్ 2024లో 24.03 లక్షల కోట్ల రూపాయల లావాదేవీలు నమోదయ్యాయి. 49.1 కోట్ల మంది ప్రజలు, 6.5 కోట్ల మంది వ్యాపారులు యూపీఐని ఉపయోగిస్తున్నారు. ఇప్పుడంతా డిజిటల్ కాలం అయిపోయింది. ఫిజికల్ క్యాష్ తీసుకోవడం ఇవ్వడం చాలా వరకు తగ్గిపోయిందనే చెప్పాలి. చిన్నా పెద్దా అన్ని అవసరాలకు కూడా యూపీఐనే వాడేస్తున్నారు. ప్రస్తుతం ఇండియాలో స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు పెరిగిపోయారు. అందుకు తగ్గట్టే.. డిజిటల్ చెల్లింపులు కూడా భారీగా పెరిగాయి. ఎంతలా అంటే యూపీఐ లావాదేవీల్లో ప్రపంచంలోనే ఇండియా నంబర్ వన్‌గా నిలిచింది. ఈ విషయాన్ని ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ సంస్థ తన నివేదికలో వెల్లడించింది. నేడు మన దేశంలో ప్రతి నెలా 1800 కోట్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయని ఐఎంఎఫ్ తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో రూ.24.03 లక్షల కోట్లు యూపీఐ ద్వారా బదిలీ అయ్యాయి. మొత్తం 18.39 బిలియన్ లావాదేవీలు నమోదయ్యాయి. 2024లో ఇదే నెలలో 13.88 బిలియన్ లావాదేవీలు కాగా.. ప్రస్తుతం 32 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుతం 49.1 కోట్ల మంది సామాన్య ప్రజలు, 6.5 కోట్ల మంది వ్యాపారులు ఈ యూపీఐ సేవలను వినియోగిస్తున్నారు. 675 బ్యాంకులు యూపీఐ సేవలను అందిస్తున్నాయి. దేశంలో మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో 85 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయి. ప్రపంచంలో రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 50 శాతం ఒక్క మన దేశంలోనే జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. భారత్‌తో పాటు యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ వంటి ఏడు దేశాల్లో యూపీఐ సేవలను అనుమతిస్తున్నాయి. బ్రిక్స్ సభ్యత్వ దేశాలకు యూపీఐని విస్తరించాలని రిజర్వు బ్యాంకు యోచిస్తోంది. సురక్షితమైన, వేగవంతమైన లావాదేవీల వల్ల యూపీఐ చెల్లింపులు ప్రజల్లో ఇంత ఆదరణ పొందాయి.

# జలాశయాల చుట్టూ విచ్చలవిడిగా రెడ్ మిక్స్ ప్లాంట్స్

- పర్యావరణం పై ప్రభావం చూపే క్రషర్ మిషన్లపై చర్యలు తీసుకోరా
- జల కాలుష్యం వాయు కాలుష్యం పర్యావరణ కాలుష్యం తో ఆందోళన
- అనుమతులు లేని నిబంధనలు పాటించని ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి
- తాగునీటిపై విషం చిమ్ముతున్న మిషన్లపై చర్యలు చేపట్టాలి



**రాజేంద్రనగర్( ప్రశ్న న్యూస్)** మహానగరానికి నిరంధించే జంట జలాశయాలపై విషం చిమ్ముతున్న క్రషర్ ప్లాంట్ లపై చర్యలు తీసుకోవాలి. జంట నగరాలకు నిరంతంచే తాగునీటి తటాకాల చుట్టూ కాంక్రీట్ మిషన్లను ఏర్పాటు చేసి కోట్లు గడిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా పెద్ద సంఖ్యలో హిమాయత్ సాగర్ చుట్టూ వెలుస్తున్న కాంక్రీట్ మిషన్లపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు. జీవో ట్రిబుల్ వన్ నిబంధన పరిధిలో ఉన్నప్పటికీ బౌలాంతస్తుల నిర్మాణాలతో పాటు హిమాయత్ సాగర్ చెట్టు ఇలాంటి నిర్మాణాలు ఆందోళన కలిగించే విషయాలు. గత కోనేళ్లుగా ఇష్టా రీతిగా క్రషర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి వ్యర్థాలన్నీ తాగునీటి చెరువులోకి వదులుతున్న కాంక్రీట్ సంస్థల యజమానులపై ప్రభుత్వాలు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మహానగరానికి నీరు అందించడం కోసం నిజాం నవాబుల కాలంలో ఏర్పాటు చేసినటువంటి జంట జలాశయాలు ఇప్పటివరకు కోట్ల మంది జనాభాకు నీరు అందిస్తున్న గండి పేట్, హిమాయత్ సాగర్ జలాశయాలను ఆగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలిజంట జలాశయాలైన గండిపేట (ఉస్మాన్‌సాగర్) హిమాయత్‌సాగర్ చుట్టూ ఉన్న ప్రాంతంలో క్రషర్ మిషన్ల కార్యకలాపాలు సాధారణంగా నిషేధించబడతాయి లేదా కఠినమైన నిబంధనలకు లోబడి ఉంటాయి.కానీ ఇక్కడ జలాశయాలు హైదరాబాద్ నగరానికి ప్రధాన మంచినీటి వనరులు కాబట్టి, వాటి పరిరక్షణ, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అత్యంత ముఖ్యం.

## క్రషర్ మిషన్లు ఏర్పాటు వల్ల సమస్యలు

క్రషర్ మిషన్లు అంటే పెద్ద పెద్ద రాళ్లను చిన్న చిన్న కంకరగా, ఇసుకగా లేదా ఇతర నిర్మాణ సామగ్రిగా మార్చే యంత్రాలు. ప్రధానంగా క్వారీలలో, నిర్మాణ రంగంలో ఉపయోగిస్తారు.అనుమతులు లేకపోయినా విచ్చల విడిగా ఏర్పాటు చేస్తున్నారు.

## జంట జలాశయాల చుట్టూ వీటి వల్ల ఎన్నో సమస్యలు



జంట జలాశయాల పరిసర ప్రాంతాల్లో క్రషర్ మిషన్ల వల్ల అనేక పర్యావరణ, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం చాలా ఉంటుంది, వీటి వల్ల వచ్చే దుమ్ము దూళి వల్ల పర్యావరణం దెబ్బతినడం, రోడ్లు దుమ్ము దూళి తో అస్తవ్యస్తంగా మారుతుంది, రహదారులు మొత్తం మిసన్ల వచ్చే దుమ్ము తో నిండిపోతుంది. క్రషర్ మిషన్లు పనిచేసేటప్పుడు భారీ మొత్తంలో ధూళి గాలిలోకి విడుదలవుతుంది. ఈ ధూళి జలాశయాలలోకి చేరి నీటి నాణ్యతను దెబ్బతీస్తుంది. అలాగే, పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు శ్వాసకోశ సంబంధిత సమస్యలను కలిగిస్తుందిశబ్ద కాలుష్యం క్రషర్ మిషన్ల నుంచి వచ్చే అధిక శబ్దం పరిసర ప్రాంతాల్లో నివసించేవారికి, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తుందని పరివాహక ప్రాంతం వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నీటి కాలుష్యం క్రషర్ కార్యకలాపాల వల్ల వెలువడే వ్యర్థ పదార్థాలు, రసాయనాలు వర్షపు నీటితో కలిసి జలాశయాలలోకి చేరే ప్రమాదం ఉంది. ఇది నీటిని కలుషితం చేసి, తాగడానికి అనర్హంగా మార్చుతుంది. కోట్లాదిమంది తాగే నీరు కాలుష్య కోరల్లో చిక్కిపోతుంది, పచ్చదనంతో కలకలలాడే జంట జలాశయాల చుట్టూ ఫ్యాక్టరీల వల్ల పర్యావరణం దెబ్బతిని అనారోగ్యానికి దారి తీసే పరిస్థితులు ఉన్నాయి క్వారీయింగ, క్రషర్ కార్యకలాపాలు నేల క్షీణతకు, వృక్షసంపద నాశనానికి దారితీస్తున్నాయి, ఇది మొత్తం పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుంది.

భూగర్భ జలాలపై ప్రభావం భారీ క్వారీయింగ్ కార్యకలాపాలు భూగర్భ జలాల మట్టాన్ని ప్రభావితం చేయవచ్చు.

## ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘన

తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కాలుష్య నియంత్రణ మండలి, జంట జలాశయాల పరిరక్షణకు కఠినమైన నిబంధనలను అమలు చేస్తున్నాయి. ఈ నిబంధనలలో భాగంగా, జలాశయాల క్యాచ్‌మెంట్ ఏరియాలో క్వారీయింగ్, క్రషర్ కార్యకలాపాలను నిషేధించడం లేదా వాటికి అనుమతులు ఇవ్వకపోవడం వంటివి ఉంటాయి. జంట జలాశయాల చుట్టూ క్రషర్ మిషన్ల కార్యకలాపాలు నిషేధించబడటం లేదా కఠిన నిబంధనలకు లోబడి ఉండటం ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు అత్యవసరం. ఈ జలాశయాలు నగరానికి జీవనాధారం కాబట్టి, వాటిని కాలుష్యం నుండి కాపాడటం అందరి బాధ్యత. ఆవశ్యకతను గుర్తించి ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటు అవుతున్న క్రషర్ మిషన్ల ప్లాంట్ల విషయంలో అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల పట్ల సానుకూల స్పందన

- బిజెపి కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల నిరంకుశ వైఖరి
- దేశంలో బీసీల జనాభాను అవమానపరిచిన ఘనత బిజెపి కే దక్కుతుంది

**మంథని ప్రతినిధి ( ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం ఉద్యోగ, విద్యా ఉపాధి కల్పన రాజకీయ రంగాలలో రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ చట్ట సభలలో బిల్లును ప్రవేశపెట్టి బీసీ వర్గాల అభ్యున్నతి కోసం 42 శాతం బిల్లును ఆమోదించి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి మార్చిలోనే పంపిస్తే దానిని లోకసభలో రాజ్యసభలో బీసీల బిల్లును చర్చించకుండా బిల్లును తిరస్కరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం జరిగింది. బీసీ రిజర్వేషన్లను తిప్పి పంపడంలో ఆంతర్యము బీసీలకు అర్థం కావడం లేదు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్నికలు నిర్వహించినప్పుడు బీసీ నినాదం తోటి బీజేపీ గెలిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రిని చేస్తానని ప్రజలను వంచించి ఓట్లకు వెళ్లారు. అప్పటి పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వా ప్రజలు బిజెపికి తాగిన గుణపాఠం చెప్పారు. ఇకనుండి అయినా బిజెపి ప్రభుత్వము బీసీలపై ప్రేమ ఒలక వస్తే బిల్లును తిరస్కరించి పంపిస్తే బీసీ మేధావులారా నాయకులారా ఇది ఎంత ఎంతవరకు సమంజసము మీరే అర్థం చేసుకొని రాబోయే స్థానిక ఎలక్షన్లలో బుద్ధి చెబుతారని ఆలోచన చేసి పవిత్రమైన ఓటు హక్కును వినియోగించుకోవలసిందిగా ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రము ఏర్పడే సమయంలో ఆంధ్ర , తెలంగాణ శాసనసభ్యులు చర్చించి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ఏర్పాటు కోసం కేంద్రానికి పంపితే వాదోపవాదాలు జరిగి చట్టసభల్లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించి రాష్ట్రపతి చేత బిల్లును ఆమోదించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కింది. నేటి రాజకీయ పరిస్థితుల అవగాహన లేమితో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వము లోకసభలో ఉన్న ప్రతిపక్ష పార్టీలను సంప్రదించకుండా, బిజెపి బిజెపి ప్రభుత్వంతో చర్చలు జరపకుండా బిల్లు ఏ విధంగా పాస్ అవుతాయో రాష్ట్ర ప్రభుత్వానికే బీసీ లందరూ వదిలిపెట్టి నమ్మకంగా ఉన్నారు. అప్పటికి కూడా నాలుగు నెలల కాలంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బిల్లును పాసు చేపియ్యకుండా ఆకులు కాలిన తర్వాత మూతులు పట్టుకుంటే ఏమీ అర్థం ఉంటుంది. అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వము కేంద్ర చట్టసభల్లో ఓబీసీలకు 27% రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర నిలిచిపోతుంది. నేటి బీసీ జనాభా కు అనుకూలంగా రేవంత్ సర్కార్ బిల్లును తీరస్కరించిన విధానాన్ని ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. ఇకనుండి అయినా బిసి వాదముతో ఉన్నటువంటి మేధావులు రాజకీయ



నాయకులు సరియైన మార్గంలో వెళ్ళనట్లయితే బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అధోగతి పాలవుతాయి ఇకనుండి అయినా బిసి మేలుకో మీ హక్కులను సాధించుకో మీరందరూ ఐకమత్యంతో పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్నా నినాదాన్ని మీరందరూ ముక్తకంఠం తోటి కోట్ల గొంతుకలతో ముందుకు వెళ్లాలని ఈ రాష్ట్ర బీసీ సబండ వర్గం రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

- జిల్లాలో మొత్తం 14 వేల నూతన రేషన్ కార్డుల పంపిణీ
- సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు చంద్రంపేట రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ




**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** అర్హులైన పేదలందరికీ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదికలోసిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని అర్హులైన 2610 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని వెల్లడించారు. అలాగే ఇప్పటికే ఉన్న కార్డుల్లో మొత్తం 4527 మందిని అదనంగా చేర్చామని వెల్లడించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మొత్తం 21 వేల రేషన్ కార్డుల లబ్ధిదారులకు బియ్యం పంపిణీ అవుతున్నాయని తెలిపారు. రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ అని, ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, గుర్తింపు కోసం కూడా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. జిల్లాలో నూతనంగా 14 వేల లబ్ధిదారులకు రేషన్ అందించేందుకు కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంకా కార్డు రాని వారు ఉంటే సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కే కే మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఎం సివిల్ సప్లై రజిత, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరిని కలిసిన కొట్టెపల్లి సుధాకర్

- మాదిగ నేతల సన్మాన కార్యక్రమానికి రావాలని విజ్ఞప్తి

**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్ సోమవారం ధర్మపురిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, దక్షిణకాశీ వేములవాడ రాజన్న లడ్డూ ప్రసాదం అందజేసి,రాజన్న కండువాతో సన్మానించి,పలు అంశాలపై కాసేపు చర్చించి, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈనెల 30 న మాదిగల ఐక్యతను చాటే దిశగా నిర్వహించనున్న "మాదిగ నేతల సన్మాన కార్యక్రమం" కు రావాలని మరోసారి గుర్తు చేయగా తప్పకుండా హాజరవుతానని వెల్లడించారని సుధాకర్ తెలిపారు.



# పేరూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పి శివం ఉపాధ్యాయ



వాజేడు (ప్రశ్న న్యూస్ ) ములుగు జిల్లా వాజేడు సర్కిల్ పరిధిలోని పేరూరు పోలీస్ స్టేషన్ ను సోమవారం ఎటునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సెక్యూరిటీ సిబ్బంది విధులు, భద్రతపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించిన ఆయన పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామీణ ప్రాంత యువత మత్తు పదార్థాలపై ఆకర్షితులు కాకుండా ఉండేలా అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టేకులగూడెం వద్ద గోదావరి వరదల సమయంలో తరసు ముంపుకు గురవుతున్న రేగు మాకు వంతెనను పరిశీలించిన ఏఎస్పి వరదల సమయంలో జాతీయ రహదారిపై రవాణా నిలిచిపోతున్న అంశాన్ని పరిగణంలోకి తీసుకున్నారు. ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమార్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** 11కేవీ ఏపీఎల్ ఎల్ సి ఫీడర్, దూలపల్లి ఫీడర్, అపెరల్ పార్క్ ఫీడర్, 33/11కేవీ గుండ్లపోచంపల్లి ఎస్ ఎస్ నుండి నైబర్‌హుడ్ ఫీడర్ లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ ఏఈ కే విజయ్ కుమార్ తెలిపారు. చెట్ల నరికివేత, నిర్వహణ పనులు ఉండడంవల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల దూలపల్లి ఫీడర్, డిఆర్ఎస్ స్కూల్ ప్రాంతం, నైబర్‌హుడ్ ఫీడర్– లక్ష్మీనగర్, ఒరిజెత 1,2,3, టెనెంట్ ప్రాపర్ట్స్, నైబర్‌హుడ్, ఎ జి సైట్, మానిక్ రెడీ నగర్, అపర్ణ, అప్పరల్ పార్క్ ప్రాంతాలకు కరెంటు అంతరాయం ఉంటుందని, ఇందుకు వినియోదారులు సహకరించాలని ఎ ఈ, కే. విజయ్ కుమార్ కోరారు.ం

## అంగరంగ వైభవంగా
# తొట్టెల ఊరేగింపు

- వర్షాలు బాగా పడి రైతులందరికీ పంటలు బాగా పండాలి: కాంగ్రెస్ నేత సాయిపేట శ్రీనివాస్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ఎస్సీ కాలనీలో తొట్టెల ఊరిగింపు ను అంగరంగా వైభవంగా నిర్వహించారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో ప్రజలు భారీ ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ఎస్సీ కాలనీలో యువకులందరూ కలిసి ఊరేగింపు కార్యక్రమానికి చాలా ఘనంగా నిర్వహించడం సంతోషకరం అన్నారు, అలాగే తెలంగాణ ప్రాంతంలో బోనాల పండుగకు చాలా ప్రత్యేకత ఉంటుందని కూడా సాయిపేట శ్రీనివాస్ తెలిపారు, మహిళలు ఎంతో సంతోషంగా ఆనందంగా జరుపుకునే గొప్ప పండగ ఈ బోనాల పండుగ అని ఆయన వివరించారు, అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరి మీద ఉండాలని, అందరికీ ఆయురారోగ్య లు, సుఖ సంపదలు ఇవ్వాలని తెలిపారు, అదే విధంగా వర్షాలు బాగా కురిసి రైతనకు సిరి సంపదలు కలిగివ్వాలని అమ్మవారినీ కోరుకున్నట్లు సాయిపేట శ్రీనివాస్ వివరించారు, ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, నటరాజ్, పండు, బాబ్జీ, ఉదయ్, సంపత్, నవీన్, కృష్ణ, పవన్, నరేష్, రాకేష్, మనోహర్, డప్పు బాబు,తదితరులు పాల్గొన్నారు.

# ముంపున కు గురైన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మున్సిపల్ పరిధి కిష్టాపూర్ లోని శ్రీ రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ దేవాలయం ముంపునకు గురైంది. ఇటీవల కురిసిన భారీ వర్షం నీటితో పాటు ఆలయం పక్కనే ఉన్న ఓ గోదాం నుండి వచ్చే మురికి నీటితో ఆలయ ప్రాంగణం లోకి భారీ ఎత్తున నీరు చేరింది. దేవాలయం తో పాటు దేవాలయం ముందు ఉన్న ఆర్చి వరకు నీరు నిండిపోయింది. దీనివల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం వెంటనే మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని ఆ గ్రామానికి చెందిన వేముల రాజిరెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై నిలిచిన వరద నీటితో పాటు, ఆలయం పక్కనే ఉన్న గోధుమల నుండి ఆలయం వైపు వరద వస్తుండడం వల్ల ఆలయం ప్రాంగణంతో పాటు దేవాలయంలోకి వరద చేరడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. గోదాం నుండి డ్రైనేజీ నీరు వస్తుందని తెలిపారు. మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి ఆలయంలోకి చేరిన మురికి వర్షపు నీటితో పాటు మురికి నీటిని తొలగించాలని వేముల రాజిరెడ్డి డిమాండ్ చేశారు.

# అంగరంగ వైభవంగా ముసాపేట బోనాల ఉత్సవాలు

**- ముసాపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కలికోట శంకర్ అధ్వర్యంలో ఫలారం బండి ఊరేగింపు**

**- ముఖ్య అతిధి గా తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, స్థానిక సీనియర్ నాయకుడు సాయి గౌడ్.**





**కూకట్ పల్లి (ప్రశ్నన్యూస్ )**బోనాల ఉత్సవాల శోభను మరింతగా పెంచుతూ మూసాపేట్ డివిజన్ అధ్యక్షుడు కలికోట శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహంకాళి బోనాలు,ఫలారం (ఫలహారం) ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది.ఆదివారం ముసాపేట లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్తా, స్థానిక సీనియర్ నాయకుడు సాయి గౌడ్ తో కలిసి ప్రత్యేక అతిథిగా హాజరై అమ్మవారికి బోనం సమర్పించి ఫలహారం బండి పాల్గొన్నారు. భక్తుల పెద్ద రద్దీతో మూసాపేట్ వీధులు పండుగ వాతావరణంలో మునిగిపోయాయి.ముసపేట లో తన స్వగృహం నుంచి ప్రభాతంనుంచి ఆలయ ప్రాంగణంలోనే వేడుకలు ప్రారంభమయ్యాయి. పండ్లతో, పూలతో అలంకరించిన ఫలహార బండి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఊరేగింపు కలికోట శంకర్ ఇంట్టి వద్ద ప్రారంభమై ముసాపేట వీధుల గుండా సాగి దేవాలయం వద్ద ముగిసింది. మార్గమధ్యంలో మహిళలు సంప్రదాయ బోనాల తొట్టెలతో, పిల్లలు రంగురంగుల దండలతో పాల్గొని జోష్‌ను పెంచారు.డప్పు, తశా, డీజే డోలు శబ్దాలతో వాతావరణం మారుమ్రోగింది. కార్యక్రమం సందర్భంగా కలికోట శంకర్ స్థానిక సమాజం ఐక్యతను ఉద్దేశిస్తూ "మన ఊరు అందరూ కలిసి పూజిస్తేనే పండుగ సంపూర్ణం" అని పేర్కొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కల్వ సుజాత గుప్తా భక్తులతో కలిసి అమ్మవారికి ఫలహారం సమర్పించి, ఆర్యవైశ్య సమాజం సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. సాయి గౌడ్ స్థానిక యువత స్వచ్ఛంద సేవకుల కృషిని ప్రశంసించారు. సామాజిక సేవ భాగంగా పేద కుటుంబాలకు పండ్ల ప్యాకెట్లు, చిన్నారులకు పాలు-పండ్ల పంపిణీ చేశారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, పర్యావరణ హితమైన సంచులు వాడాలని అవగాహన కల్పించారు. భారీ రద్దీ దృష్ట్యా పోలీసులు ప్రత్యేక బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపులు ఏర్పాటుచేయడంతో కార్యక్రమం ఎటువంటి అవాంతరమూ లేకుండా ముగిసింది.కార్యక్రమం లో భక్తులు భారీ గా పాల్గొన్నారు.

## జీవో 49 పై ఆందోళన అక్కర్లేదు



**ఆసిఫాబాద్, :** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జీవో 49పై ఆందోళన అక్కర్లేదని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఇతర కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. సోమవారం ప్రభుత్వ సలహాదారులకు వినతిపత్రం అందజేశామని, జీవో అమలు నిలిపివేయాలని నిర్ణయించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి జీవో పూర్తిగా రద్దు చేయేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా ఉండాలని నాయకులు ప్రజలకు భరోసా ఇచ్చారు.

## సర్దుబాటు పారదర్శకంగా జరగలేదు

ముథోల్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా జరగలేదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజేష్ నాయక్ అన్నారు. సోమవారం జన్నారం ప్రెస్ క్లబ్లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఎక్కువ మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారని, దీంతో మిగిలిన పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలన్నారు.

## ఎల్లంపల్లి ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు పంపిణీ చేయాలి: రాయపనేని హరికృష్ణ



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) మండలంలోని ఎల్లంపల్లి ఎస్టి కాలనీ వాసులు 23 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు కల్పించాలని న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసిల్దార్ జనార్దన్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ, అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు సంయుక్తంగా మాట్లాడుతూ సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో గత 23 సంవత్సరాలు ముందు భూ పోరాటాలు ఫలితంగా ఎల్లంపల్లి ఎస్టి కాలనీవాసులకు 40 సెంట్లు భూమిని పంపిణీ చేయడం జరిగిందన్నారు. అప్పటినుండి సాగు చేసుకుంటున్న ఎస్టీ కాలనీవాసులకు పట్టాల పంపిణీ చేయాలని వారు కోరారు. అదేవిధంగా ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. వారికి సంబంధించిన స్థలంలో గుడిసె ఏర్పాటు చేసుకుంటే స్థానిక వీఆర్వో అడ్డుపడడం పై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఈ విషయంపై స్పందించి ఎస్టీలకు ( యానాదులకు ) పట్టాలు, ఇంటి స్థలాలు లేని వారికి ఇల్లు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించడానికి కూడా వెనుకాడ బోమని హెచ్చరించారు. అదేవిధంగా స్థానికేతరులు దొంగ పట్టాలు తీసుకున్న వారివి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాకీర్, వెంకటరత్నం, కృష్ణమూర్తి, చెంగల్ రాయలు, బత్తయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే లో వచ్చిన ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరిస్తాం: తహసిల్దార్ జనార్దన్ రాజు




**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం నందు సోమవారం తాసిల్దార్ జనార్దన్ రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో మండలంలోని ప్రజలు వారి వారి సమస్యలను ఎంఆర్ఓ దృష్టికి తీసుకువచ్చారు, వాటిని సంబంధిత అధికారులతో విచారణ చేపించి సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మార్వో జనార్దన్ రాజు అర్జీదారులకు తెలియజేశారు. ఎమ్మార్వో జనార్దన్ రాజు మాట్లాడుతూ.నేడు గ్రీవెన్స్ డే పురస్కరించుకొని మండలంలోని ప్రజలు తమ తమ సమస్యలను అర్జీ రూపంలో తనకు తెలియజేశారని , ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలియజేశారు, ఈ గ్రీవెన్స్ డే లో ప్రజలు ఇంటి స్థలాలు కావాలని, భూ సంబంధిత విషయాలు, గతంలో రికార్డులు తారుమారైనటివి తమ దృష్టికి తీసుకుని వచ్చారని ,వాటిని వెనువెంటనే పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపడతామని తెలియజేశారు.

## రాజన్న సేవలో... మహారాష్ట్ర ఆర్పీఐ పార్టీ నాయకులు




**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని సోమవారం మహారాష్ట్ర ఆర్పీఐ (ఏ) పార్టీ భీవండి,థానేజిల్లా యూత్ ప్రెసిడెంట్,అడ్వకేట్ అంబాదాస్ గైక్వాడ్, మహారాష్ట్ర ఎన్డిటీవీ జర్నలిస్టులు సందీప్,ఖండూ ఉభలే,మార్గం గోపి,ప్రత్యేక పూజలు నిర్వహించి,దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వచన మండపంలో సదరు మహారాష్ట్ర భక్తులకు స్వామివారి కండువా కప్పి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

## పలువురికి నివాళులు అర్పించిన

# మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి,: సత్తుపల్లి లారీ యాజమానుల సంఘం సభ్యులు షేక్ మస్తాన్ బ్రెయిన్ స్ట్రోక్ తో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. పట్టణానికి చెందిన మసీదు రోడ్డులో నివసించే వంట మేస్త్రి మట్టా ప్రసాద్ అనారోగ్యంతో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించారు. అట్టి విషయాలు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తన బృందంతో కలసి భౌతికకాయాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## తెలంగాణ నీటి హక్కుల కోసం బీఆర్ఎస్వి పోరాటం

మధిర,: తెలంగాణ నీటి హక్కుల కోసం బిఆర్ఎస్వి రాష్ట్రవ్యాప్త నిరసనను తలపెట్టింది. అందులో భాగంగా ఉద్యమానికి సంబంధించిన వాల్ పోస్టర్స్ ను సోమవారం ఖమ్మం తెలంగాణ భవన్లో బిఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ఆవిష్కరించారు. బనకచర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న అలసత్వ ధోరణిని విద్యార్థుల లోకానికి తెలియజేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లింగబోయిన సతీష్, షారుక్ అర్ఫాత్, గోపి, మునఫర్ ఉన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు

పాలేరు, : ప్రభుత్వ భూమి ఎవరు ఆక్రమించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఖమ్మం రూరల్ తహసీల్దార్ పి. రాంప్రసాద్ పేర్కొన్నారు. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయనే వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఏదులాపురం చెరువు ఆక్రమణకు గురైన విషయంలో సర్వే చేస్తున్నామని, ప్రస్తుతం సర్వేయర్లు శిక్షణలో ఉన్నందున సర్వే నిలిచిపోయిందన్నారు. శిక్షణ అనంతరం సర్వే పునఃప్రారంభించి చెరువు హద్దులను గుర్తిస్తామని వెల్లడించారు.

## అధికార కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

నర్సంపేట,: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముల్క రాజేష్ తో పాటు 4 5మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ జెండా ఆవిష్కరించిన రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గంలో ఎక్కువ స్థానాల్లో యువకులకే అవకాశం కల్పించి వారిని ప్రజాప్రతినిధులను చేస్తానని అన్నారు.

## కొడకండ్లలో ఆహార భద్రత

# కొత్త రేషన్ కార్డుల పంపిణీ

పాలకుర్తి, : పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల మండల కేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాల్‌లో సోమవారం MLA మామిడాల యశస్విని రెడ్డి చేతుల మీదుగా తహశీల్దార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం 10 ఏళ్ల పాటు ఒక్క కార్డు కూడా ఇవ్వలేదని, మన ప్రభుత్వం సన్న బియ్యం తో పాటు కొత్త కార్డులు కూడా అందించిందని ఆమె చెప్పారు.

## మంత్రుల పర్యటనలో వర్షంతో ఇబ్బందులు

భూపాలపల్లి, : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొరికొత్తపల్లి మండల కేంద్రానికి చేరుకొని నూతన పోలీస్ స్టేషన్ భవనంను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఐటీ మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. మంత్రులు మాట్లాడుతుండగా ఒకసారిగా కురిసిన వర్షంతో ఇబ్బందులు పడ్డారు. వర్షంలోనూ గొడుగులు పట్టుకొని మంత్రులు ప్రసంగాన్ని కొనసాగించారు.

# ప్రభుత్వ భూమి కబ్జా..

## వ్యక్తి అర్థనగ్నంగా నిరసన

జనగామ, : జనగామ జిల్లా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన భూమడ్ల పెద్దాపు రం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఫ్లెక్సీ కట్టి అర్ధనగ్నంగా వినూత్న నిరసన చేపట్టాడు. ముత్తారం గ్రామంలోని కోమటి చెరువు మరియు బ్రాహ్మణ కుంట కబ్జాకి గురిఅయి నదని, కబ్జా కావడంతో తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లడానికి బాట లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికా రులకి విన్నపించిన ఏ అధికారి పట్టించుకోవడం లేదని ఆవేదనతో వినూత్న నిరసన తెలిపారు.

## ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలి

వర్ధన్నపేట, : పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామంలో సోమవారం జరిగిన బిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధ హామీలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు.

### ఆయకట్టుకు ప్రభుత్వం వెంటనే సాగునీరు విడుదల చేయాలి

మెదక్, : మెదక్ జిల్లాలోని హల్దీ ప్రాజెక్ట్, గణపురం ఆయకట్టుకు ప్రభుత్వం వెంటనే సాగునీరు విడుదల చేయాలని ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ కాలంలో రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందించారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జాడలేని చినుకు..

# మిడ్ మానేరు వెలవెల

కరీంనగర్: బోయినపల్లి మండలంలోని శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ప్రాజెక్టులో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. రెండు నెలలుగా ముసురు తప్ప భారీ వర్షాలు కురవక ప్రాజెక్టుల్లో వరద చేరలేదు. ప్రాజెక్టులో ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు కేవలం 0. 319 టీఎంసీల నీరు మాత్రమే చేరింది. నీళ్లు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## 26 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం



చొప్పదండి,: 240 కోట్ల రూపాయలతో 26 వేల ఎకరాలకు సాగునీరు అందించే పనులు చొప్పదండి మండలంలో శరవేగంగా జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సాంబయ్యపల్లె, గుమ్లాపూర్ గ్రామాల్లో సోమవారం పార్టీ జెండాను ఆవిష్కరించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గుమ్లాపూర్, సాంబయ్యపల్లి, కాట్నపల్లి గ్రామాల చెరువులను నింపి సస్యశ్యామలం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాకపోకలు బంద్

సిరిసిల్ల,: సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో భారీ వర్షాలు పడుతున్నాయి. వర్షాల కారణంగా మూలవాగు ప్రవహిస్తుండటంతో మండలంలోని మామిడిపల్లి మూలవాగుపై ఉన్న కాజ్ వే కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రానికి వెళ్లేందుకు, రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ధర్మపురిలో పలు మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి అడ్లూరి

ధర్మపురి, : ధర్మపురి మండలంలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా దమ్మన్నపేట గ్రామానికి చెందిన దూడ శైలజ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి భర్త సతీష్ గాయాల పాలై చికిత్స పొంది ఇంటికి రాగా వారిని పరామర్శించి 5వేల రూపాయలు ఆర్థిక సహాయన్ని, అదేవిధంగా దోనూర్ గ్రామానికి చెందిన గొల్లెన రవి కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సహాయన్ని వారికి అందజేశారు.

## డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక

# పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల,: జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు, పొలిటికల్ సైన్స్, కామర్స్ మరియు కంప్యూటర్ అప్లికేషన్స్ పోస్టుల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకయ్య సోమవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కళాశాల విద్యా కమీషనర్ సీసీఈ ఏ దేవసేన మరియు మల్టీ జోన్ జాయింట్ డైరెక్టర్ జేడీ ప్రొఫెసర్ డీ ఎస్ ఆర్ రాజేందర్ సింగ్ లు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అభ్యర్థులకు సూచించారు.

## సీపీఐ నూతన కార్యదర్శులకు సన్మానం




ఖమ్మం: ఖమ్మం జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నూతన కార్యదర్శిగా దండి సురేష్, సహాయ కార్యదర్శిగా జమ్ముల జితేందర్ రెడ్డి గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ఉద్యమకారుల హక్కులు,
## ఆత్మగౌరవం,కొరకు చలో గన్ పార్క్...

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి పిలుపు.**

**జమ్మికుంట :** సోమవారం జమ్మికుంట లో ఏర్పాటు చెసినా విలేకరుల సమావేశములో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్లాడుతుతెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, ఆదేశాల మేరకు హుజురాబాద్ నియోజకవర్గం మరియు జమ్మికుంట, ఇల్లంతకుంట మండల కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి, నియామాకపు ఉత్తర్వులు అందజేశారు. హుజురాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా నకీర్త.రాజు, ను జమ్మికుంట మండల ఉపాధ్యక్షునిగా పేరవేని. రమేష్, ఇల్లంతకుంట మండల సహాయ కార్యదర్శిగా గుడికందుల.రాజయ్య,ను నియమిస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎక్కటి సంజీవరెడ్డి, మరియు నాయకులు మాట్లాడుతూ: మంగళవారం రోజు చలో ఘన్‌పార్క్ హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికీ తెలంగాణ ఉద్యమకారులు తమ విధిగా భావించి హాజరు అయి వారి హక్కుల కోరకు ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం హాజరు కాగలరని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి.సంజీవరెడ్డి పిలుపునివ్వడం జరిగినది. ఈ కార్యక్రమములో ఆరే.రమేష్ రెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గ కార్యదర్శి పాకాల.మల్లారెడ్డి, గురుకుంట్ల.రాజీరు, ముత్యాల.రమేష్, పెరవేన.కుమార్ యాదవ్, మిల్కూరి.మల్లారెడ్డి, తధితరులు పాల్గొన్నారు...

## బైక్ దొంగల అరెస్టు

**గుడివాడ** రాష్ట్రంలోని ఐదు జిల్లాల పరిధిలో చోరీలకు పాల్పడుతున్న బైక్ దొంగలను కృష్ణాజిల్లా గుడివాడ పోలీసులు అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న బైక్ లు, పోలీసులు మీడియా ముందు ప్రదర్శించగ, గుడివాడ డిఎస్పి ధీరజ్ వినిల్ వివరాలు వెల్లడించారు.ఐదు జిల్లాల్లోనీ 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు తెలిపారు.దొంగల్లో ఒకరు ఆటో డ్రైవర్ కాగా, మరొకరు టాపిక్ పని చేస్తున్నారన్నారు.వారి వద్ద ఆరు లక్షల, 50వేల విలువచేసే 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని డిఎస్పి ధీరజ్ వినీల్ చెప్పారు. పార్కింగ్ ప్రాంతాలు మరియు, రద్దీ ప్రదేశాల్లో రెక్కి నిర్వహించి వీళ్ళు దొంగతనాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. నిందితులను కోర్టులో హాజర పరుస్తామని ఆయన అన్నారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వన్టౌన్ సి.ఐ కే.శ్రీనివాస్, ఎస్సై గౌతమ్ కుమార్, కానిస్టేబుళ్లు సురేంద్రబాబు, వేణుగోపాల్, మురళీకృష్ణ, సత్యనారాయణలను అభినందించిన డిఎస్పి ధీరజ్ వినీల్ వారికి రివార్డులు అందించారు.

## జువెలరీ షాప్‌లో భారీ దొంగతనం

**సూర్యాపేట** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజి రోడ్డులో ఉన్న సాయి సంతోషి జువెలరీ షాప్ లో భారీ దొంగతనం జరిగింది. అర్ధరాత్రి సమయంలో గ్యాస్ కట్టర్ సహాయంతో మెయిన్ షెటర్ కట్ చేసి. మరోవైపు వెనుక నుంచి బాత్రూంకు రంధ్రం చేసి ఏకంగా 18 కేజీల బంగారు నగలను దొంగలు దోచుకెళ్ళారు. ఉదయం షాప్ ఓపెన్ చేసే సమయంలో గ్యాస్ కట్టర్ తో షట్టర్ కట్ చేసి ఉండటం, బంగారం దుకాణం అంతా నగల స్థానంలో ఖాళీగా ఉండడం, బాత్రూంలో గోడకు రంధరం చేసి ఉండటంతో.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సూర్యాపేట పట్టణ పోలీసులు, క్లూస్ టీమ్ లు సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు. అలాగే సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దాదాపు 18 కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు ఇతర వస్తువులు భారీ చోరీకి గురి కావడంతో.. నగల దుకాణం వ్యాపారి కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది.

## వైభవంగా స్వామివారి తులసీ దళార్చన

**సింహాచలం** సింహాచలం ఆలయ వైదిక సిబ్బంది ఆలయ అధికారులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తముగా శ్రీ స్వామివారికి 108 బంగారు తులసి దళాల తో అత్యంత వైభవంగా తులసీ దళార్చన తులసీ దళార్చన లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తులు సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా తులసీ దళార్చన అత్యంత వైభవంగా, నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధీష్టింప జేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి తులసీ దళార్చన, సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.

## వైకాపా నిరసన

**కొవ్వూరు** ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ గూడూరు శ్రీనివాస్,కొవ్వూరు ఇంచార్జ్ తలారి వెంకట్రావు, పార్టీ శ్రేణులతో కలిసి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు బస్టాండ్ సెంటర్లో గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు..ఈసందర్భంగా మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి బదులు రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని రాష్ట్రంలో చంద్రబాబు లోకేష్ చెప్పిన విధంగా రాజ్యాంగ వ్యవస్థలన్నీ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని మాత్రమే అమలు చేస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నాయి రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తూ చంద్రబాబు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలియజేశారు...

## ఇంటికి చేరుకున్న ముద్రగడ

**కిర్లంపూడి** సీనియర్ నే ముద్రగడ పద్మనాభం సోమవారం అంబులెన్స్ లో కిర్లంపూడి తన నివాసానికి చేరుకున్నారు. పద్మనాభరెడ్డికి అయన భార్య దిష్టి తీసిన తరువాత కుటుంబ సభ్యులు ఇంట్లోకి తీసుకెళ్లారు. మాజీ ఎంపీ వంగా గీత జగ్గంపేట వైఎస్ఆర్సిపి ఇన్చార్జి మాజీమంత్రి తోట నరసింహం తదితరులు అయన ఇంటికి వచ్చారు.

## మృతుని కుటుంబానికి సంతాపం తెలిసినడీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి



**బద్వేలు** బద్వేలు నియోజకవర్గ అట్లూరు మండలము వేములూరు గ్రామ వాస్తవ్యులు దేవర సీమయ్య నిన్నటి దినమున స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకున్న కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేసినారు. ఈ కార్యక్రమములో మండల టిడిపి ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా ప్రమాణస్వీకారం

**కౌతాళం** మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా వెంకటపతి రాజు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తనయుడు తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి అనంతరం చైర్మన్ గా ఎన్నికైన వెంకటపతి రాజు కు శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం రైతులకు వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు మేలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప ధని, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి బాపురం శివ మోహన్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి కోట్రేష్ గౌడ్, రమేష్ గౌడ్,కురుగోడు, దోడ్డన్న గౌడ్,అబ్దుల్ రెహ్మన్,సోమశేఖర చౌదరి,శివప్ప గౌడ్,సిద్ధు,రాజా బాబు, మంజునాథ ధని, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ మహోత్సవానికి మంత్రి ఆనంను ఆహ్వానించిన ఫిట్ పర్సన్

**- మంత్రిచే స్వామివారి గోడపత్రిక ఆవిష్కరణ - కళ్యాణోత్సవానికి హాజరవుతా మంత్రి ఆనం హామీ**

**బ్రహ్మంగారిమఠం** భూత, భవిష్యత్తు, వర్ధమాన కాలజ్ఞాని జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి మఠంలో ఆగస్టు నెల ఎనిమిదో తారీఖున బ్రహ్మంగారిమఠం లో శ్రీ మాతా గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మాస కల్యాణ మహోత్సవము జరుపుతున్నామని ఆ కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారిని ఆహ్వానించడం జరిగినదని అందుకు మంత్రిగారు సుముఖత వ్యక్తం చేస్తూ తప్పకుండా ఈ మాస కల్యాణ మహోత్సవానికి తాను హాజరవుతానని మంత్రి చెప్పినట్లు బ్రహ్మంగారిమఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ సోమవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిని కలిసిన సందర్భంలోనే ఆగస్టు నెలలో జరిగే మాస కల్యాణ మహోత్సవానికి సంబంధించిన గోడ పత్రికను కూడా మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందన్నారు .ఈ సందర్భంగా మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలో మొట్టమొదటిసారిగా ఈ యొక్క మాస కల్యాణ మహోత్సవం ప్రతినెల జరపడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని ఆయన కొనియాడారు సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత మాత గోవింద మాంబతో కలిపి కళ్యాణం జరుగుతూ ఉండేదని ఇప్పుడు నెలకోసారి ఈ మాస కళ్యాణం జరగడం భక్తులు స్వామివారి కళ్యాణాన్ని దగ్గరుండి చేపించే అవకాశం బ్రహ్మంగారిమఠం వారు ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ఈ మాస కల్యాణ ఉత్సవాన్ని స్వామి వారి భక్తులు అందరూ, విరివిగా ఉపయోగించుకొని ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని ప్రజలు, భక్తులకు మంత్రి పిలుపునిచ్చారన్నారు. అలాగే స్వామివారి రథం మాడవీధులు రోడ్డు విస్తరణకు ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారములు ఉంటాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలియజేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఆనం అల్లుడు బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీ రితీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి మాస కల్యాణ మహోత్సవాలను నెలనెలా ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని దగ్గరుండి భక్తులు వారి వారి పేర్ల మీద చేపించేందుకు సులువుగా ఉంటుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని రితీష్ కుమార్ అని పిలుపునిచ్చారు. అలాగే ఈ మాస కల్యాణ మహోత్సవాలలో పాల్గొనేందుకు తమ కుమారుల పేరిట రెండు లక్షల రూపాయలు ఈ యొక్క మాస కళ్యాణంనకు శాశ్వత ఉభయదారులుగా ఉంటాము అని రితీష్ కుమార్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగినదని బ్రహ్మంగారిమఠం దేవాలయ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మఠం సిబ్బంది తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజులకు ఆర్థిక చేయూత అందించాలి

**- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి, దబ్బేట తిరుపతి**



**పెద్దపల్లి** మత్స్య శాఖ సొసైటీలకు రుణ సహాయాన్ని అందించాలని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల, యువజన సర్వీసుల మంత్రి వాకిటి శ్రీహరికి ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి దబ్బేట తిరుపతి వినతి అందజేశారు. సోమవారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి, స్టేట్ వీషరీస్ మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి దబ్బేటతిరుపతి నేతృత్వంలో మచ్చ గాంధీ మల్టీ స్టేట్ ఫిషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పులబోయన భీమన్న ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయంలో కలిశారు. ముదిరాజులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందించాలని, మత్స్య శాఖ సొసైటీలకు రుణ సహాయాన్ని కల్పించాలని ఈ సందర్భంగా వారు కోరినట్లు వివరించారు. సొసైటీ నెలకొల్పి రెండేళ్లు గడుస్తున్నా రుణ సహాయం లేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మంత్రికి దృష్టికి తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ముదిరాజు కుటుంబాలు కేవలం పండ్లతోటలు, చేపల అమ్మకం మీద జీవనం చేస్తున్నారని వారికి ఆర్థిక చేయూతను అందించాలని, ప్రభుత్వ సహకారం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని రాష్ట్ర మంత్రి కి విన్నవించారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర అధ్యక్షులు దామెర రాజయ్య, ప్రచార కార్యదర్శి బోయపోతుల కొమరయ్య, ఫిషరీస్ సభ్యులు ఊదరి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచలంకు ఆర్టీసీ బస్సు



**జయశంకర్ భూపాలపల్లి,** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రజానికానికి ఒక శుభవార్త... ఈ నెల 28 జూలై రోజున కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, కాంచీపురం, తిరుపతి, శ్రీకాళహస్తి ప్రత్యేక బస్సు నడిపించబడుతుందని డిపో మేనేజర్ ఇందు తెలిపారు. ఈ టూర్ ప్యాకేజ్ టికెట్ ధర ఒక్కరికి 5300 రూపాయలు. ప్రయాణం చేయాలనుకునేవారు సీటు బుకింగ్ కోసం ఈ నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు: 9701967519, 8801778959 మరియు వచ్చే నెలలో కూడా వారానికి ఒకటి చొప్పున టూర్ ప్యాకేజీలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా విజయవాడ, అన్నవరం , భద్రాచలం, పంచారామాలు, షిరిడి వంటి ప్రముఖ యాత్ర స్థలాలు ఉండనున్నాయి. 30 మంది ప్రయాణికులు ఉండినచో వారి కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ ఇంధు తెలిపారు. ఈ టూర్ ప్యాకేజీలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఇందు కోరారు.

## కోటి మంది శరణార్థులపై ప్రభావం

నిధులలో కోత కారణంగా కోటి మందికి పైగా శరణార్థులు మానవతా సహాయాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదమున్నదని ఐక్యరాజ్య సమితి శరణార్థి సంస్థ (యూఎన్‌హెచ్‌సీఆర్) హెచ్చరించింది. నిధుల కొరతకు సంబంధించి ఇది ఒక నివేదికను కూడా విడుదల చేసింది. ఈ ఏడాది నిర్దేశించిన నిధుల లక్ష్యం 10.6 బిలియన్ డాలర్లుగా ఉండగా.. ఇందులో 23 శాతమే అందిందని వివరించింది. నిధుల కోత ఫలితంగా ఈ ఏడాది చివరి నాటికి మొత్తం బడ్జెట్ 3.5 బిలియన్ డాలర్లు మాత్రమే ఉంటుందనీ, అది 122 మిలియన్ల మంది శరణార్థులు, ప్రజల అవసరాలను తీర్చటానికి మాత్రమే సరిపోతుందని ఆ నివేదిక పేర్కొన్నది. నిధులను పొందే విషయంలో తాము క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నామని యూఎన్‌హెచ్‌సీఆర్ ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ డైరెక్టర్ డొమినిక్ హైడే తెలిపారు. 11.6 మిలియన్ల మంది శరణార్థులు, ప్రజలు యూఎన్‌హెచ్‌సీఆర్ కల్పించే మానవతా సాయాన్ని కోల్పోతారేమోన్న భయాందోళనలో తామున్నామని వివరించారు. అయితే ఏయే దేశాలు తాము అందించే నిధులలో కోత విధించాయన్న వివరాలను మాత్రం నివేదిక పేర్కొనలేదు. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత యూఎన్‌హెచ్‌సీఆర్‌కు అందించే నిధుల్లో కోత విధించారు. గతేడాది ఈ ఏజెన్సీకి అందిన నిధుల్లో 40 శాతం, అంటే రెండు బిలియన్ డాలర్లకు పైగా యూఎస్ నుంచే సమకూరింది. అయితే ఈ సారి మాత్రం ఆ నిధులలో యూఎస్ కోతను విధించింది. ఈ నేపథ్యంలో యూఎన్‌హెచ్‌సీఆర్ నివేదిక రావటం గమనార్హం. సూడాన్, మయన్మార్, అఫ్ఘనిస్తాన్ వంటి అనేక దేశాల్లో దాదాపు 1.4 బిలియన్ డాలర్ల విలువైన సహాయ కార్యక్రమాలను నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని యూఎన్‌హెచ్‌సీఆర్ వివరించింది.

## 2006 ముంబై రైలు పేలుళ్ల కేసు..

**12 మందిని నిర్దోషులుగా ప్రకటించిన కోర్టు**

ముంబై: 2006 ముంబై రైలు పేలుళ్ల కేసులో 12 మంది నిందితులను నిర్దోషులుగా సోమవారం బాంబే హైకోర్టు ప్రకటించింది. జస్టిస్ అనిల్ కిలోర్, శ్యామ్ చందక్‌లతో కూడిన ప్రత్యేక ధర్మాసనం సోమవారం ఉదయం సంచలన తీర్పు వెలువరించింది. నిందితులపై ఉన్న అభియోగాలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైందని పేర్కొంది. గతంలో విధించిన మరణశిక్షలు, జీవిత ఖైదులను సమర్థించడానికి నిరాకరించిన న్యాయస్థానం.. వారికి విధించిన శిక్షలను రద్దు చేసింది. కాగా, జూలై 11, 2006న రద్దీ సమయంలో పశ్చిమ రైల్వే లైన్‌లోని ముంబై సబర్బన్ రైళ్లలో ఏడు బాంబు పేలుళ్లు సంభవించాయి. ఈ వరుస బాంబు దాడుల్లో 189 మంది మృతి చెందగా.. 800 మందికి పైగా గాయపడ్డాయి. ఫస్ట్-క్లాస్ కంపార్ట్‌మెంట్‌లను లక్ష్యంగా చేసుకుని ప్రెషర్ కుక్కర్ కంటైనర్లలో బాంబులు పెట్టి పేల్చిన సంఘటనలు ముంబై నగరాన్ని తీవ్ర భయాందళనకు గురిచేశాయి. ఈ బాంబు దాడుల్లో పోలీసులు 12 మందిని అరెస్టు చేశారు. 2015లో ప్రత్యేక కోర్టు ఈ కేసులో 12 మందిని దోషులుగా నిర్ధారించింది. వారిలో ఐదుగురికి మరణశిక్ష విధించగా.. మిగిలిన ఏడుగురికి జీవిత ఖైదు విధించింది. తర్వాత దోషులు తమ శిక్షలపై న్యాయస్థానంలో అప్పీల్ చేసుకున్నారు. తాజాగా ఈ కేసులో బాంబే హైకోర్టు 12 మందిని నిర్ధోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెల్లడించింది.

## ఏ. ఐ. యస్. బి 9 వ జాతీయ మహాసభ లను జయప్రదం చెయ్యండి

**ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పిలుపు**




**కడప** అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏ.ఐ.ఎస్. బి 9 వ జాతీయ మహాసభలు కడప నగర వేదికగా సెప్టెంబర్ 12,13, 14 తేదీలలో జరగనున్నట్లు ఈ మహాసభలను విద్యార్థులు యువకులు, విద్యావంతులు మేధావులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని శాసనమండలి సభ్యులు ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ మహాసభలకు సంబంధించిన లోగోను ఆదివారం కడప నగరంలోని 7బిష్త్ర కేఫ్ మినీ హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సమాజంలో విద్యార్థి సంఘాల పాత్ర చాలా కీలకమైనదని, విద్యారంగ సమస్యల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల పట్ల విద్యార్థి సంఘాల పోరాటాలు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలు విద్యా సంస్థలకు విద్యార్థులకు ప్రభుత్వాలకు మధ్య వారధిలా పనిచేస్తూ నిత్యము విద్యారంగ సమస్యల పట్ల సమస్యల పోరాటాలు నిర్వహించడం హర్షనీయమని వారు కొనియాడారు. అఖిల భారత విద్యార్థి బ్లాక్ జాతీయ మహాసభలు కడప నగర వేదికగా జరుగుతున్న శుభ సందర్భంగా విద్యావంతులు మేధావులు, విద్యార్థులు యువకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు తెలుపునిచ్చారు.

ఆహ్వాన సంఘం అధ్యక్షులు పి.వి.సుందర రామరాజు మాట్లాడుతూ... నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలతో ముందుకు సాగుతున్న అఖిల భారత విద్యార్థి బ్లాక్ సోషలిజం శాంతి అభ్యుదయం అని నినాదాలతో ముందుకు సాగుతున్న అఖిల భారత విద్యార్థి బ్లాక్ 9 వ జాతి మహాసభలను జయప్రదం చేయాలని వారు విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఆహ్వాన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ మాట్లాడుతూ.... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణ విద్యకు ప్రోత్సాహం అందిస్తున్నారని, దేశంలో కార్పొరేటీకరణ కాషాయకరణ ప్రైవేటీకరణ ముందుకు సాగుతున్నాయని, ప్రభుత్వ యూనివర్సిటీలను ప్రైవేటుపరం చేస్తూ నరేంద్ర మోడీ సర్కార్ కుట్ర చేస్తుందని వారు వాపోయారు. కడప నగరంలో జరిగే జాతీయ మహాసభలలో విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం మరియు నిరుద్యోగ యువకుల కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటూ ముందుకు సాగడానికి జాతీయ మహాసభలు ఎంతగానో దోహద పడతాయని వారు తెలిపారు. 9వ జాతీయ మహాసభలను విద్యార్థులు మరియు యువకులు మేధావులు విద్యావంతులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎస్ బి నాయకులు పాపి రెడ్డి పల్లి పృథ్వి,సగిలి రాజేంద్రప్రసాద్ మనోజ్,చిరంజీవి, విష్ణు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## మోగనున్న పెళ్లి బాజాలు..

**పెళ్లికి మంచి ముహూర్తాలు ఇవే..**

ఈ నెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతోంది. మళ్లీ తెలుగు రాష్ట్రాల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. జులై 26, 30, 31, ఆగస్టు 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17, సెప్టెంబర్ 24, 26, 27, 28, అక్టోబర్ 1 ,2 ,3 ,4 ,8, 10, 11, 12, 22, 24, 29, 30, 31, నవంబర్ 1 ,2 ,7 ,8, 12, 13, 15, 22, 23, 26, 27, 29, 30 తేదీల్లో పెళ్లికి ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు.

భాద్రపద మాసం-21- సెప్టెంబర్ 21 వరకు ముహూర్తాలు లేవు. ఆగస్టు, సెప్టెంబర్ ,అక్టోబర్, నవంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీగా పెళ్లిళ్లు జరగనున్నాయి. అందుకు తగ్గట్టుగానే ఇప్పటికే ఆగస్టు రెండో తేదీ నుంచి పెళ్లిళ్లు భారీగా మొదలు కాబోతున్నాయి. ఆషాడ మాసంలోనే పెళ్లిళ్లకు సంబంధించి బంగారం అంగల్లలో బంగారు కొనుగోలు భారీగా జరిగాయి. కిరాణా షాపులు కూడా కితకితలు కోసం వారు తహతహలాడుతూ ముందడుగు వేస్తున్నారనటంలో ఎటువంటి సందేహం లేదు.

# బిజినెస్‌లోకి రష్మిక మందన్నా

స్టార్ హీరోయిన్ గా ఎనలేని క్రేజ్ సొంతం చేసుకుంది రష్మిక మందన్న. నేషనల్ క్రష్ గా దేశ వ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకుంది. నేమ్, ఫేమ్ తో పాటు భారీగానే ఆస్తులు సంపాదించుకుంది. దీంతో త్వరలోనే ఈ భామ ఎంటర్ ప్రెన్యూర్ కాబోతోంది. బాలీవుడ్ టాలీవుడ్ లో ఇప్పటికే చాలా మంది హీరోయిన్లు ఎంటర్ ప్రెన్యూర్లుగా ఎదుగుతున్నారు. ఇప్పుడు వారి బాటలోనే రష్మిక కూడా ఈ స్టెప్ తీసుకుంటోంది. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునేందుకు ఈ కూర్గ్ బ్యూటీ ప్రయత్నాలు ప్రారంభించిందని తెలుస్తోంది. బిజినెస్ రంగంలోకి అడుగుపెడుతున్న విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది రష్మిక. 'ఈ రోజు నేను చాలా ముఖ్యమైన షూట్ కి వెళ్తున్నాను. మీరు చెప్పిన వ్యాపారాన్ని నేను ప్రారంభిస్తాను' అని రష్మిక తన తల్లి సుమన్ మందన్నకు వీడియో కాల్ ద్వారా తెలియజేసింది. సుమన్ కూడా తన కుమార్తె కు శుభాకాంక్షలు తెలిపింది. అయితే రష్మిక ప్రారంభించబోయే వ్యాపారం ఏమై ఉంటుంది అనే దానికి ఆన్సర్ లేదు. ఈ నేపథ్యంలో రష్మిక ఏ వ్యాపారం చేయబోతున్నారు? ఏ సెక్టార్‌ను ఎంచుకున్నారు అనేది ఫిలిం వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.



# నాలుగు సినిమాలతో అలరించనుంది



అందాల తార జాన్వీ కపూర్ హిందీతో పాటు తెలుగులోనూ పలు సినిమాలు చేస్తోంది. అవన్నీ ఇప్పుడు వరుసగా విడుదల డేట్స్ ఫిక్స్ చేసుకుంటున్నాయి. నిజానికి ఈ నెలలోనే ఆమె నటించిన బాలీవుడ్ చిత్రం పరమ్ సుందరి విడుదల కావాలి. కానీ చివరి నిమిషంలో వాయిదా పడింది. వచ్చే నెల విడుదల అయ్యే అవకాశం ఉంది. అక్టోబర్‌లో మరో సినిమా రానుంది. కరణ్ జోహార్ నిర్మిస్తోన్న సన్నీ సంస్కారికీ తులసి కుమారి సినిమా దసరా కానుకగా అక్టోబర్ 2న విడుదల కానుంది. తాజాగా నిర్మాణ సంస్థ రిలీజ్ డేట్ ని ప్రకటించింది. డిసెంబర్ లో హోంబౌండ్ సినిమా విడుదల కానుంది. ఇది ఇప్పటికే కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శితమై ఆకట్టుకుంది. ఆమె నటిస్తున్న బడా తెలుగు చిత్రం పెద్ది. రామ్ చరణ్‌తో ఆమె నటిస్తోన్న మొదటి మూవీ. షూటింగ్ జరుగుతోంది. మార్చి 27, 2026న విడుదల కానుంది పెద్ది. మొత్తంగా ఈ భామ నుంచి వరుసగా నాలుగు సినిమాలు విడుదల కానున్నాయి.



# రాశీఖన్నాకు బంపరాఫర్

## 'ఉస్తాద్ భగత్ సింగ్'లో ఛాన్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా శ్రీలీల హీరోయిన్ గా దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్ లో చేస్తున్న సాలిడ్ మాస్ ఎంటర్టైనర్ మూవీ "ఉస్తాద్ భగత్ సింగ్". అయితే ఈ సినిమాలో శ్రీలీల కాకుండా మరో బ్యూటీ కూడా ఉంటుంది అని లేటెస్ట్ న్యూస్. ఆ హీరోయిన్ ఎవరో కాదట బబ్లీ బ్యూటీ రాశి ఖన్నా. రాశి పవన్ కాంబినేషన్లో ఎప్పుడు నుంచో పవన్ ఫ్యాన్స్ సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. ఫైనల్ గా ఇప్పుడు సెట్ అయ్యేలా కనిపిస్తుంది. ఈ రోల్ కోసం ఎంతోమందిని పరిశీలించిన మేకర్స్ చివరికి రాశీ ఖన్నాని సెలక్ట్ చేశారు. ఈమధ్య కాలంలో తెలుగులో పెద్దగా అవకాశాలు లేని రాశీకి ఇది గోల్డెన్ ఛాన్సేనని చెప్పాలి. ఇప్పటికే ఆమె సెట్‌లో అడుగుపెట్టింది. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతుండగా పవన్ కళ్యాణ్‌తో పాటు మిగతా నటులపై కీలక సీన్స్ షూట్ చేస్తున్నారు. ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తోన్న ఈ సినిమాని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని పవన్ కంకణం కట్టుకుని మరీ డేట్స్ అడ్జస్ట్ చేశారు. ఓ వైపు రాజకీయాలతో బిజీగా ఉన్నా తనను నమ్ముకున్న నిర్మాతలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్' మూవీని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.



## పొగడ్తలతో తేలుతున్న

# నిధి అగర్వాల్



సాధారణంగా పవన్ కళ్యాణ్ దర్శకులు, నిర్మాతలను పొగిడినంతగా హీరోయిన్లను ప్రశంసల్లో ముంచెత్తడం అరుదు. కానీ నిధి అగర్వాల్ ఆ ఛాన్స్ కొట్టేసింది. ఇవాళ జరిగిన హరిహర వీరమల్లు ప్రెస్ మీట్ లో పవన్ మాట్లాడుతూ నిధి అగర్వాల్ ప్రమోషన్ల భారాన్ని మొత్తం తన భుజాల మీద మోస్తుంటే తనకే సిగ్గనిపించిందని, సినిమాని అనాథలా వదిలేశామనే ఫీలింగ్ కలిగిందని, అలాంటిది లేదని చెప్పడానికి తాను సమావేశానికి వచ్చానని, నా చిత్రాన్ని నేనే ఎందుకు వదిలేస్తానని చెప్పుకొచ్చారు. నిధికి ఇది చాలా పెద్ద కాంప్లిమెంట్. అంటే ఆమె ఎంత సీరియస్ గా పబ్లిసిటీలో భాగం పంచుకుంటుందో పవన్ చూశారన్న మాట. పవన్ చెప్పినదాంట్లో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే సమయాభావం వల్ల హరిహర వీరమల్లులోని మెయిన్ క్యాస్టింగ్ ఎవరూ ఇంటర్వ్యూలకు అందుబాటులో లేరు. సత్యరాజ్, బాబీ డియోల్, సునీల్, సుబ్బరాజు లాంటి వాళ్ళు వేర్వేరు కారణాలతో వచ్చే పరిస్థితిలో లేదు. కీరవాణికి వ్యక్తిగతంగా కుటుంబంలో జరిగిన విషాదం వల్ల మీడియా ముందుకు రాలేకపోయారు. దర్శకుడు జ్యోతికృష్ణ, నిర్మాత ఏఎం రత్నం పనుల్లో బిజీగా ఉన్నారు. దీంతో నిధి అగర్వాల్ అంతా తానై చూసుకుంది. ఒక రోజు ఏకంగా 16 మీడియా ఇంటర్వ్యూలు ఇచ్చి నాన్ స్టాప్ గా కో ఆపరేట్ చేసింది. ఇంత ఓపికగా ఉండటం అరుదే. ది రాజా సాబ్ డిసెంబర్ లో రిలీజ్ కానుండటంతో నిధి అగర్వాల్ కు ఇప్పుడీ హరిహర వీరమల్లు సక్సెస్ చాలా ముఖ్యం.

## SSMB 29 కోసం

# కొత్త లొకేషన్

దర్శకధీరుడు ఎస్ఎస్.రాజమౌళి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ మూవీ %యూవీదీ%29 కోసం యావత్ తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో మహేష్ బాబు సరికొత్త లుక్‌తో కనిపిస్తుండటంతో ఈ సినిమాపై భారీగా అంచనాలు నెలకొన్నాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ నెక్స్ట్ షెడ్యూల్ కెన్యాలో ప్లాన్ చేశారు మేకర్స్. అయితే కొన్ని కఠిన పరిస్థితుల కారణంగా ఈ సినిమా షూటింగ్ ను అక్కడ చేయలేకపోతున్నారట.

దీంతో ఈ మూవీ యూనిట్ షూటింగ్ కోసం కొత్త లొకేషన్ ను ఎంపిక చేశారు. టాంజానియాలోని కొన్ని సుందరమైన ప్రదేశాలలో ఈ షూటింగ్ నిర్వహించేందుకు మేకర్స్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను దాదాపు రూ.వెయ్యి కోట్ల బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు.



## కాంతారని తక్కువ అంచనా వేయొద్దు



రకరకాల అవాంతరాలు, అడ్డంకులు, యూనిట్ సభ్యుల హఠాన్మరణాలతో ఉక్కిరిబిక్కిరి అయిన కాంతార ఏ లెజెండ్ చాప్టర్ 1 షూటింగ్ అయిపోయింది. ఈ మేరకు అధికారిక మేకింగ్ వీడియోతో హీరో కం దర్శకుడు రిషబ్ శెట్టి దీన్ని ప్రకటించేశారు. ఏమైనా వాయిదా పడుతుందేమోననే ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో వాటికి చెక్ పెట్టేశారు. హోంబాలే ఫిలిమ్స్ బ్యానర్ మీద అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిన ఈ ప్యాన్ ఇండియా మూవీ మేకింగ్ వీడియో చూస్తే షాక్ తినడం ఖాయం. గొప్ప విజువల్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతున్న గ్యారెంటీని రెండు నిమిషాల వీడియోలోని ప్రతి ఫ్రేమ్ లో ఇచ్చారు. ఇందులో కంటెంట్ సంగతి పక్కనపెడితే కాంతార పోటీని తక్కువంచనా వేసిన ఎవరైనా ఇప్పుడు ఆలోచించుకోక తప్పదనేలా ఉంది. పేరుకి డబ్బింగ్ లా కనిపిస్తున్నప్పటికీ తెలుగులోనూ కాంతారకి కెజిఎఫ్ రేంజ్ లో సీక్వెల్ హైప్ ఉంది. ఎందుకంటే మొదటి భాగం ఎలాంటి అంచనాలు లేకుండా రెండు వారాలు ఆలస్యంగా రిలీజైనా నలభై కోట్లకు పైగా కలెక్షన్లు తెచ్చింది. దీంతో ఈసారి అంతకు మించి వసూలు చేస్తుందనే ధీమా బిజినెస్ వర్గాల్లో ఉంది. అక్టోబర్ 2 ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న కాంతార ఏ లెజెండ్ చాప్టర్ మీద అన్ని భాషలు కలిపి రెండు వందల కోట్లకు పైగానే బిజినెస్ జరిగేలా ఉంది. ఇక పోటీ విషయానికి వస్తే అక్టోబర్ 1 ధనుష్ ఇడ్లి కడాయ్ వస్తుంది. దానికన్నా వారం ముందు పవన్ కళ్యాణ్ ఓజి, బాలకృష్ణ అఖండ 2లో ఉన్నాయి కనక వెంటనే వారం గ్యాప్ లో కొత్త సినిమాలు రిలీజ్ చేసేందుకు టాలీవుడ్ నిర్మాతలు సాహసించడం లేదు. సో కాంతారకు ఓపెన్ గ్రౌండ్ ఉంటుంది.

# నాచారంలో కొన్నే ఇంద్రమ్మ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల ఉత్సవాలు





నాచారం(ప్రశ్న న్యూస్) ఆషాడ బోనాలు నాచారంలో అంగరంగ వైభవంగా జరిగాయి. నాచారం కొన్నే ఇంద్రమ్మ గురువు చిలకలగూడ పద్మమ్మ ఆధ్వర్యంలో శివశక్తులతో ఒగ్గుజెగ్గులతో డిల్లెం బల్లెం డప్పులతో భారీగా బోనాలు ఎత్తుకొని నాచారం విలేజ్ నుండి మహంకాళి దేవాలయం వరకు అంగరంగ వైభవంగా బోనాల జాతర కొనసాగింది.అంతకంటే ముందు ఉదయం తెల్లవారుజాము నుండి కొన్నే ఇందిరమ్మ ఇలవేల్పైన రేణుక ఎల్లమ్మ, సమ్మక్క సారక్క తల్లికి ఉపవాసంతో నైవేద్యం, బోనం కుండలను పూజించి అమ్మవారిని తీరొక్క పూలతో అలంకరించి బోనం కుండలను వేప కొమ్మలు పసుపు కుంకుమ తో బోనాలను ముస్తాబు చేసి, అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం భారీ ఎత్తున బోనాలతో కొన్నే ఇందిరమ్మ శిష్యులతో నాచారం విలేజ్ నుండి మహంకాలమ్మ దేవాలయం వరకు భారీగా బోనాలతో డప్పు చప్పులతో బోనాలు తీశారు. బోనం ఎత్తుకున్న ఇందిరమ్మకు భక్తులు అడుగడుగునా కాళ్ళు మొక్కుతూ భక్తులు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ బోనాల ఉత్సవాల్లో కొన్నే వెంకన్న, రాజ్ కుమార్, మహేష్, శ్రీధర్, రేణుక, సంగీత, సబిత, అఖిల్, పకృత, వెంకటమ్మ, సతీష్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విలాసాగర్ గ్రామ శ్రీ కృష్ణ కురుమ యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో సోమవారం శ్రీ కృష్ణ కురుమ యాదవ సంఘం నూతన కమిటీని గ్రామ కురుమ యాదవ కుల సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులుగా పోలే మల్లేశం,ఉపాధ్యక్షుడిగా మ్యాకల నర్సయ్య,కోశాధికారిగా ఏనుగుల అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా గోట్ల ఐలయ్యను,సలహాదారులుగా మిరుపాల కొమురయ్యలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీని గ్రామ పెద్దలు, సంఘ ప్రముఖులు ఆశీర్వదిస్తూ సంఘ ఐక్యత, అభివృద్ధి దిశగా ముందుకు నడిపించాలని సూచించారు. కొత్త కమిటీకి సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బ్రాహ్మణ సత్రం అన్నదాన భవన నిర్మాణానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ఐదు లక్షల మంజూరు

**- బోరు.. మోటార్ ఏర్పాటుకు బండి సంజయ్ హామీ**

**- కేంద్రమంత్రి కి బ్రాహ్మణ సత్రం సభ్యుల ప్రత్యేక కృతజ్ఞతలు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడలోని బ్రాహ్మణ నిత్యాన్నదాన అన్నసత్రం తరఫున నిర్మించనున్న అన్నదాన భవన నిర్మాణానికి కేంద్ర మంత్రి,కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఇటీవల బ్రాహ్మణ సత్రం నిర్వాహకులు, బీజేపీ పట్టణ శాఖ నేతలు భవన నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేయగా, వెంటనే స్పందించిన బండి సంజయ్ మంజూరు చేసిన నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం సత్రంలో బోరింగ్ పనులు ప్రారంభమయ్యాయి. మోటారు కూడా ఏర్పాటు చేస్తానని మంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చారు. సోమవారం జరిగిన ఈ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా భాజపా సీనియర్ నేత ప్రతాప రామకృష్ణ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వేములవాడ పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్, బ్రాహ్మణ సత్రం సభ్యులు,భాజపా నాయకులు,కార్యకర్తలు, భక్తులు భారీగా పాల్గొన్నారు. కేంద్ర మంత్రికి బ్రాహ్మణ సత్రం నిర్వాహకులు ఆయన సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సిరిపురం లో పిడుగు పాటు తో తృటిలో తప్పిన గొర్ల కాపరి ప్రాణం

**చిల్లపల్లికి చెందిన పుట్ట పోచయ్య 30 గోర్లు మృతి**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలంలోని సిరిపురం లో పిడుగు వేయడంతో అదృష్టవశక్తి గొర్ల కాపరి ప్రాణం తృటిలో తప్పింది. స్థానికుల కథనం ప్రకారం సోమవారం చిల్లపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పుట్ట పోచయ్య సిరిపురం దగ్గర గోదావరి ఒడ్డుకు గొర్లను మేపాడానికి వెళ్లగా సాయంత్రం 5 గంటల సమయం లో ఒకే సారి పెద్ద శబ్దంతో గొర్ల మంద పైన పిడుగు పడటంతో 30 గోర్లు అక్కడికి అక్కడే మృతి చెందాయి. అక్కడే ఉన్న గొర్ల కాపరి పుట్ట పోచయ్య కళ్ళు ఒకే సారి మూతలు పడి స్పృహ కొలిపోయారు. అక్కడే ఉన్న గొర్లు మేపుతున్న మరో గొర్ల కాపరి గంగయ్య వెంటనే వారి కుటుంబ సభ్యులకు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెళ్ళి వెంటనే పుట్ట పోచయ్యను హాస్పిటల్ కి తరలించారు. ప్రభుత్వం వెంటనే పిడుగు పాటుకు గురై 30 గొర్రె ల మృతితో దాదాపు రూ. 3 లక్షల పైగ నష్టం జరిగిందని, అ గొర్రెల కాపరి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకొని నష్టం పరిహారం చెల్లించాలని మంథని యాదవ సంఘం మండల అధ్యక్షులు పరిశవేన మోహన్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు.

## శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి ముక్కంటి ప్రసాదాలు.. ఎం సుబ్బయ్య



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) తిరుపతి పద్మావతి అతిధి గృహంలో శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడు మాసారపు సుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిసి దుశ్యాలువతో సత్కరించి ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. అనంతరం పద్మావతి అతిధి గృహంలో నిర్వహించిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పై దాడిని ఖండించిన మార్కెట్ చైర్మన్ రాగిరి ఆనంద్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై మొన్న జరిగిన దాడిని ఖండించారు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు,వైస్ చైర్మన్ దేవేందర్,బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్.మొన్న రాత్రి 8:30 గంటల సమయంలో మానికేశ్వర్ నగర్లో బోనాల పండుగ సందర్భంగా అక్కడికి చేరుకుంటున్న క్రమంలో వెనక నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పది ద్విచక్ర వాహనాల పై వచ్చి ఎమ్మెల్యే వాహనాన్ని ఆపుతూ కారు అద్దాలను కొడుతూ భయభ్రాంతులకు గురి చేశారు.విషయం అర్థం కాక ఓయు పోలీస్ స్టేషన్లో అగంతకుల పై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు నిన్న ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఇంటికి చేరుకొని పరామర్శించారు.ఈనేపథ్యంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు ఎమ్మెల్యే ను కలిసి జరిగిన సంఘటన పై అడిగి తెలుసుకున్నారు.కంటోన్మెంట్సీనియర్ నేత,బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ దాడిని ఖండిస్తూ,ఎమ్మెల్యే పై గుర్తు తెలియని వ్యక్తుల వివరాలు త్వరలో పోలీస్ అధికారులు వెల్లడిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.అలాగే మార్కెట్ వైస్ చైర్మన్ దేవేందర్ మాట్లాడుతూ ఇరవై నాలుగు నియోజకవర్గంలో ఏకైక నియోజకవర్గం సికింద్రాబాద్ కంటోన్మెంట్.హైదరాబాద్ మహానగరంలో ఏకైక దళిత ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై గుర్తు తెలియని వ్యక్తులు దాడిని ఖండించారు.త్వరలోఓయు పోలీసులు ఈ దాడి ఎవరి ప్రమేయం వల్ల జరిగిందో బట్టబయలు చేసి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## డీసీసీ ఉపాధ్యక్షులు వారాల నర్సింగం కు ఘన సత్కారం

**- ప్రజల అభిమానానికి ప్రతిరూపంగా ...ఘన సన్మానం**



కరీంనగర్,(ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన వారాల నర్సింగం ను కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 21వ డివిజన్, శ్రీరామ్ నగర్ కాలనీ (రోడ్ నం. 4, 5) కాలనీ వాసులు సోమవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూవారాల నర్సింగం కాలనీలో గత కొంతకాలంగా నిస్వార్థంగా ప్రజా సేవలో తలమునకలై పని చేస్తూ, సమస్యలు పరిష్కరించడంలో ముందుంటారన్నారు.ఈ నేపథ్యంలో ప్రజలు ఆత్మీయతతో, గౌరవంతో ఆయనను అభినందించారు.

### నియామకాన్ని ఆనందంగా స్వీకరించిన కాలనీవాసులు

"మీ సేవల పట్ల మాకు గౌరవం మాత్రమే కాదు, గాఢమైన విశ్వాసం ఉంది. ప్రజా సమస్యలపై మీ స్పందన, చిత్తశుద్ధి ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తోంది.ఇదే స్ఫూర్తితో మీరు ముందుకు సాగాలని, రాజకీయంగా మరింత ఉన్నతికి చేరాలని మనసారా కోరుకుంటున్నాం. మేమంతా ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటాం" అంటూ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వారాల నర్సింగం కు శాలువా కప్పి, పూలహారంతో ఘనంగా సత్కరించారు. ఈ సత్కార కార్యక్రమం సంతోషం,సమీక్ష, సంఘీభావానికి దర్పణంగా నిలిచింది.

## తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా నూనె మల్లేష్ యాదవ్‌కు నియామకం



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండలం,గొల్లపల్లి వట్టిమల్ల గ్రామానికి చెందిన నూనె మల్లేష్ యాదవ్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, "బీసీల ఐక్యత కోసం,వారి అభ్యున్నతిని సాధించేందుకు పాటుపడతాను. రానున్న ఎన్నికల్లో బీసీల గెలుపు కోసం నిస్వార్థంగా శ్రమిస్తాను" అని స్పష్టం చేశారు.తన నియామకానికి సహకరించిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి,రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షులు పెంట అజయ్,జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ యాదవ్‌లకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే దాడి వెనుక హస్తం ఎవరిది :క్రింశాక్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేష్ పై కొంతమంది ఆగంతకులు దాడికి యత్నించడం ఓ నాటకంలా అనిపిస్తుందని బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్ స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేకే రక్షణ లేకుండా పోయిందని శాంతిభద్రతల విషయంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ పై జరిగిన దాడి యత్నాన్ని ఎమ్మెల్యే, పోలీసులు భిన్న కోణాలలో చెప్తుండడం చూస్తుంటే ఇదంతా ఓ"కట్టు కథే"అన్నట్లు అనిపిస్తుందని అన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ కు ఆ పార్టీలోనే ఉన్న వ్యక్తితో ప్రాణహాని ఉందని ప్రస్తావిస్తున్న నేపథ్యంలో ఆయన పేరు బహిర్గతం చేయకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటో ఆయన చెప్పాలని అన్నారు.అలాగే మంత్రి అండదండలతో నేరా చరిత్ర కలిగిన వ్యక్తి తనపై దాడికి యత్నించారని ఆరోపిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్ వారి పేర్లను బహిర్గతం చేయాలని,అలాగే సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా ఆయన పై ఉందని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించడంతోపాటు వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు.కాంగ్రెస్ లోని అంతర్గత కుమ్ములాటలు,భద్రత పెంపు కోసం ఎమ్మెల్యే కొత్త నాటకానికి తెర లేపారనే విషయం స్పష్టంగా కనబడుతున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల కోసం మాణికేశ్వర్ నగర్ కు వెళ్తున్న ఎమ్మెల్యే వాహనంపై దాడి జరిగితే ఎమ్మెల్యే పై హత్యాయత్నానికి ప్రయత్నం జరిగినప్పటికీ ముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణమని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ తనపై దాడికి యత్నించిన ఘటనలో నేర చరిత్ర ఉన్న వ్యక్తి గురించి మాట్లాడినప్పుడు ఆయన పేరు ప్రస్తావించలేకపోవడానికి కారణం ఏంటో సమాధానం చెప్పాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు.రెండు రోజుల క్రితమే డీసీపీని కలిసి తనకు ప్రాణహాని ఉందని చెప్పిన 48 గంటల్లోనే కొంతమంది ఆగంతకులు దాడికి యత్నించడాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకుని బాధ్యులను కఠినంగా శిక్షించాలని,లేకపోతే ప్రజల్లో తప్పుడు సాంకేతికలు పోతాయన్నారు.ఈ ఘటనకు బాధ్యులైన వ్యక్తుల పేర్లను, మంత్రి పేరును కూడా ఎమ్మెల్యే శ్రీ గణేష్ బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.మంత్రి కావాలనే ఆకాంక్షతో ఉన్న శ్రీ గణేష్ తన భద్రత పెంపుకోసమే కొత్త నాటకానికి తెరలేపారా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది లేకపోతే ఈ విషయంపై సమాధానం చెప్పాలని కోరారు.అదిగాక రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీనించాయని,గత ఇరవై రోజుల్లో రెండు హత్యలు చోటు చేసుకోవడం నిజంగా దురదృష్టకరం.పది రోజుల క్రితం "చందు నాయక్"పై కాల్పుల మోత,అలాగే కాంగ్రెస్ పార్టీ కి చెందిన వ్యక్తిని కూడా హతమార్చిన సంఘటన కూడా తెలిసిందే! మరో విషయం ఏమిటంటే మల్కాజిగిరి నియోజకవర్గంలో కూడా భారసా వర్సెస్ కాంగ్రెస్ దాడుల దాకా చోటు చేసుకుంది అంటే ల్యాండ్ అండ్ ఆర్డర్ ఏ స్థాయిలో పని చేస్తుందో ఈ సంఘటనలే ఉదాహరణలని పేర్కొన్నారు బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్.ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీసులు స్పందించి వాస్తవాలు వెల్లడించాలి, లేకపోతే రేపటి రోజును తలచుకోవాలంటేనే సామాన్యులు భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితి నెలకొంటుంది.

## బోయినిపల్లి మండలంలో అఖిలపక్షం రిలే నిరాహార దీక్ష తాత్కాలిక వాయిదా

**- స్తంభంపల్లి బ్రిడ్జి పనులు పునఃప్రారంభం నేపథ్యంలో... నిర్ణయం...!**



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు గత సంవత్సరం నుంచే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించేందుకు మండలంలోని అఖిలపక్షం నేతలు రిలే నిరాహార దీక్ష చేపట్టేందుకు ముందుగానే పత్రికా ప్రకటన ద్వారా ప్రకటించారు.ఇప్పటికే ప్రభుత్వం బ్రిడ్జి పనులు పునఃప్రారంభించిన నేపథ్యంలో తాత్కాలికంగా దీక్షను వాయిదా వేయాలని అఖిలపక్షం నిర్ణయం తీసుకుంది. అయితే, పనులు త్వరితగతిన పూర్తి చేయకపోతే మళ్లీ కఠిన పోరాటాలకు దిగుతామని, ప్రజల పక్షాన ఉద్యమాలు కొనసాగిస్తామని నేతలు హెచ్చరించారు.ఇంతకేకాకుండా,దేశాయిపల్లి- కొదురుపాక రహదారి పక్కన ఉన్న బ్రిడ్జి సమీపంలో రోడ్డు అధ్వాన్న పరిస్థితిలో ఉందని, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిని కూడా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.బ్రిడ్జి పనులను పునఃప్రారంభించినందుకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్‌కు బోయినిపల్లి అఖిలపక్షం నేతలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, సీనియర్ నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు నరసింహ చారి, బొంగోని అశోక్ గౌడ్, రాజూరి కిరణ్, కళ్యాణ అనిల్, సిపిఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, బీఎస్పీ నాయకులు పెగ్గర్లా మహేందర్, మాజీ సర్పంచుల జెఎసి ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపల్లి కరుణాకర్,కళ్యాణ్,కార్తీక్, అజయ్,పోతూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

